ఇద్దరికీ హెల్మెట్ తప్పనిసరి

ద్విచక్ర వాహన చోదకుడితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా ధరించాల్సిందే

నేటి నుంచి కొత్త నిబంధన అమలు



విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):

నగరంలో ఇకపై ద్విచక్ర వాహన చోదకుడితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాల్సిందే. లేనిపక్షంలో పోలీసులు కేసు నమోదుచేస్తారు. అంతేగాకుండా వాహనం నడుపుతున్న వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలకు రవాణా శాఖ అధికారులకు పంపించేస్తారు.

- ఒక్కరు హెల్మెట్ పెట్టుకోకపోయినా ఈ-చలాన్ జారీ
- వాహనం నడిపే వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్
- తనిఖీల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు

రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకు ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఆదివారం నుంచి నగరంలో అమలు చేస్తున్నట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అత్యధికం ద్విచక్ర వాహనాలకు సంబంధించినవే ఉంటున్నాయన్నారు. మృతుల్లో కూడా వారే అధికంగా ఉంటున్నారన్నారు. బైక్ నడుపుతున్న వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే నిబంధన ఇంతవరకూ అమలు చేశామని, అయితే ప్రమాదం జరిగినప్పుడు వెనుక కూర్చున్నవారు తలకు తీవ్ర గాయం కారణంతో మృతిచెందుతున్నారన్నారు. ఇలాంటివి రోజురోజుకీ పెరుగుతుండడంతో సుప్రీంకోర్టు ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. దీంతో సెప్టెంబరు ఒకటి నుంచి ఈ నిబంధనను అమలు చేస్తున్నట్టు గత కొద్దిరోజులుగా నగరవాసులకు అవగాహన కల్పించామన్నారు. ఆదివారం నుంచి నిబంధన అమలులోకి వస్తుందని, ద్విచక్ర వాహనంపై ఇద్దరు ప్రయాణిస్తే ఇద్దరూ విధిగా ఐఎస్ఐ గుర్తింపు కలిగిన హెల్మెట్‌ను ధరించాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. నగరంలో ప్రతిరోజూ 40 వేల ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, వాటిపై ప్రత్యేక బృందాలతో రోడ్లపై నిఘా పెడతామన్నారు. ట్రాఫిక్... మిగతా 4వ పేజీలో

వరుణ ప్రతాపం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కలెక్టరేట్‌లోని ఖజానా, తపాలా కార్యాలయాల్లోకి నీరు
- విద్యాసంస్థలకు సెలవు
- నేడూ వర్షాలు



నగరంలో వర్షం

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):

ముసురు కొనసాగుతోంది. వరుసగా మూడో రోజు శనివారం నగరం తడిసి ముద్దయ్యింది. ఉదయం నుంచే మొదలైన వాన సాయంత్రం వరకు తెరలు తెరలుగా కురుస్తూనే ఉంది. మూడు రోజుల క్రితం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గురు, శుక్రవారాలు జోరుగా వర్షాలు కురిశాయి. అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారడంతో శనివారం ఉదయం నుంచి వర్షం జోరందుకుంది. వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో శనివారం జిల్లాలో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. రోడ్లపక్క చిరువ్యాపారులు అనేక అవస్థలు పడ్డారు. దైనందిన కార్యక్రమాలకు బయలుదేరిన ఉద్యోగ, వ్యాపార, శ్రామికవర్గాల వారు తడిసిపోయారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయం షరామామూలుగానే తడిసిపోవడంతో ఆవరణలో నీరు చేరింది. ఇదే కార్యాలయానికి ఆనుకుని ఉన్న తపాలా కార్యాలయంలోకి వర్షం నీరు వచ్చి చేరడంతో విధులకు ఆటంకం కలిగింది. లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపైకి మురుగునీరు చేరింది. కాల్వల్లో ప్లాస్టిక్ చేరడంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. వాయుగుండం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. ఖరీఫ్ పంటలకు వల్ల మేలు చేకూరుతుందని వ్యవసాయ శాఖ అధికారి ఒకరు తెలిపారు. వాయుగుండం శనివారం రాత్రి తీరందాట వచ్చన్న అంచనా నేపథ్యంలో ఆదివారం కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. నగరంలోని కొండవాలు ప్రాంతాల్లో రాళ్లు, కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉందని హెచ్చరించింది. వర్షాలపై కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. పాత భవనాల్లో నివసించేవారిని అప్రమత్తంచేయాలన్నారు.కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేశారు. అత్యవసర పరిస్థితుల్లో 0891-2590100, 0891- 2590102కు ఫోన్ చేయాలని సూచించారు.

వర్షపాతం వివరాలు

కేంద్రం	మి.మీ.లు
ములగాడ	57.2
పెదగంట్యాడ	56.4
మహారాణిపేట	42.6
గాజువాక	40.6
భీమునిపట్నం	38.2
విశాఖపట్నం గ్రామీణం	36.4

ఆర్టీసీకి వర్షం దెబ్బ

- పడిపోయిన ఆక్యుపెన్సీ, ఆదాయం
- రూ.1.35 కోట్ల మేర గండి

ద్వారకా బస్‌స్టేషన్, ఆగస్టు 31: జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాల వల్ల ఆర్టీసీ విశాఖ రీజియన్ రూ.1.35 కోట్ల మేర ఆదాయం కోల్పోయింది. బుధవారం సాయంత్రం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండడంతో ప్రయాణికులు బాగా తగ్గారు. ఆక్యుపెన్సీ, రోజువారీ ఆదాయం పడిపోయాయి. సాధారణ రోజుల్లో ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు 72 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో రూ.95 లక్షలు ఆదాయం వస్తుంది. భారీవర్షాల కారణంగా బుధవారం 60 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదు కాగా రూ.70 లక్షల ఆదాయం వచ్చింది. గురువారం 53 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదై రూ.65 లక్షలు ఆదాయం వచ్చింది. శుక్రవారం 48 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదై రూ.53 లక్షలు ఆదాయం వచ్చింది. శనివారం 50 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదుకాగా రూ.57 లక్షలు ఆదాయం వచ్చింది. శ్రావణమాసం చివరి వారంలో ఎక్కువ ముహూర్తాలు ఉండడంతో రోజువారీ ఆదాయం 50 శాతం అదనంగా వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే భారీవర్షాలతో అధికారుల అంచనాల తారుమారు అయ్యాయి. మరో రెండు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

రహదారులు ఛిద్రం

ఎక్కడికక్కడ గుంతలు

- వాహన చోదకులకు తప్పని తిప్పలు
- నాలుగైదు నెలల క్రితం నిర్మించినవి కూడా ధ్వంసం
- నిర్మాణంలో నాణ్యత లోపించడమే కారణమని విమర్శలు



గోతులమయంగా ప్రసాద్‌గార్డెన్స్ రహదారి

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. జాతీయ రహదారి మొదలుకుని, నగరంలో పలు ప్రధాన రహదారులు గుంతలమయంగా తయారయ్యాయి. అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా నగరంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండడంతో రోడ్లన్నీ బాగా నానిపోయాయి. అలాంటి సమయంలో వాహనాల రాకపోకల తాకిడికి తారుపిక్కలు లేచిపోతున్నాయి. క్రమంగా గోతులు ఏర్పడుతున్నాయి. వర్షం నీరు ఆ గోతుల్లో చేరిపోవడం, వాటిల్లో నుంచి వాహనాలు వెళుతుండ డంతో అవి మరింత పెద్దవిగా మారుతున్నాయి. మధురవాడ నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకూ జాతీయ రహదారిపై పలు చోట్ల గోతులు ఏర్పడ్డాయి. జాతీయ రహదారిపై భారీ వాహనాల తాకిడి ఎక్కువగా ఉండడంతో అవి మరింత పెద్దవయ్యాయి. నగరంలో అంతర్గత రోడ్ల పరిస్థితి కూడా అదే మాదిరిగా తయారైంది. ఎంవీపీ డబుల్‌రోడ్డు నుంచి ఉషోదయ జంక్షన్, శివాజీ పార్కు రోడ్డు, సీతమ్మధార రోడ్డు, గురుద్వార జంక్షన్ నుంచి ద్వారకానగర్ మీదుగా సరస్వతీ పార్కుకు వెళ్లే రోడ్డు, చౌల్ట్రీ నుంచి డాల్ఫిన్ జంక్షన్ మీదుగా రైల్వే స్టేషన్‌కు ... మిగతా 4వ పేజీలో



వెంకోజీపాలెం నుంచి ఇసుకతోట జాతీయ రహదారి వద్ద గొయ్యి

తనిఖీలపై తాత్సారం

పరిశ్రమల్లో మొదలుకాని ఇంటర్నల్ ఆడిట్

- 3 నుంచి ప్రారంభిస్తామంటున్న అధికారులు
- తగిన మార్గదర్శకాలు రాలేదనే వాదన

- 'ఎసెన్షియా' ఘటన తరువాత మరో రెండు ప్రమాదాలు
- మరో ఘటన చోటుచేసుకోకముందే మేల్కొనాలి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖ జిల్లాలోని పరిశ్రమల్లో అన్నీ నామమాత్రపు తనిఖీలే జరుగుతున్నాయి. అటు యాజమాన్యాలు, ఇటు అధికారులు దీనిని సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఈ నెల 22న అచ్యుతాపురం ఆర్థిక మండలిలోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది మరణించారు. ఇది ఫార్మా రంగంలోనే అతి పెద్ద ప్రమాదం. వెంటనే అధికారులు నానా హడావిడి చేశారు. అటు అనకాపల్లిలో, ఇటు విశాఖ జిల్లా కలెక్టర్లు అధికారులతో సమావేశాలు నిర్వహించి, వారం రోజుల్లో అన్ని పరిశ్రమల్లోను ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని, ఇంకా పెద్ద సమస్యలు ఉంటే వాటిని సరిదిద్దేంత వరకు ఉత్పత్తి నిలిపివేయాలని కూడా సూచించారు. ఇవన్నీ మొదలుకాక ముందే మరో రెండు ప్రమాదాలు జరిగాయి. పరవాడలోని రాంకీ ఫార్మా సిటీలోని సినర్జీన్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మరణించారు. ఇక్కడ ఘటన జరిగిన విషయం మరుసటిరోజు వరకు అధికారులకు తెలియజేయలేదు. ఒక దగ్గర ప్రమాదం జరగ్గానే మిగిలిన పరిశ్రమలన్నీ అప్రమత్తంగా ఉండాలి. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. వరుసగా జరుగుతున్న ప్రమాదాలను పరిశీలిస్తే పనిచేసే సిబ్బందికి అక్కడ ఉపయోగిస్తున్న రసాయనాలపై సరైన అవగాహన కల్పించడం లేదని, వాటివల్ల జరిగే ప్రమాదాలు గురించి చెప్పడం లేదని, ఏదైనా జరిగితే వెంటనే చేపట్టాల్సిన చర్యలపై కూడా ఎటువంటి శిక్షణ ఇవ్వడం లేదని తేలింది. తాజాగా శుక్రవారం సాయంత్రం ములగాడలోని శ్రావణ్ షిప్పింగ్ ... మిగతా 4వ పేజీలో



మరో రసాయన ప్రమాదం

- ఐదుగురికి అస్వస్థత
- శ్రావణ్ షిప్పింగ్ కంపెనీలో ఫార్మా సంబంధిత పౌడర్ లోడింగ్ చేస్తుండగా ఘటన
- బాధితులు ఆస్పత్రికి తరలింపు

- వార్త మెయిన్ 12లో

పెందుర్తి ఎంఈవో-1 సువర్ణ సస్పెన్షన్

- 2019లో మధ్యాహ్న భోజనం బియ్యం పక్కదారి వ్యవహారం
- ఏడాది క్రితమే విద్యా శాఖకు విజిలెన్స్ నివేదిక
- ఇప్పుడు చర్యలు
- ఒక హెచ్‌ఎం, గుమస్తాపై కూడా సస్పెన్షన్ వేటు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):

పెందుర్తి-1 మండల విద్యాశాఖాధికారిని, విశాఖ, భీమిలి డివిజన్ల ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో కె.సువర్ణను పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. ఆమె అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా పనిచేస్తున్న సమయం (2019 జూన్ 17న)లో బడి పిల్లలకు మధ్యాహ్న భోజనం పథకం కోసం ఇస్కాన్ సంస్థకు ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం పక్కదారి పట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ చేపట్టి ఇచ్చిన నివేదిక మేరకు ఆమెపై వేటు వేశారు. అప్పటి కేడీపీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడు (సర్వీస్‌లో ఉండగా మృతి చెందారు), పీఈటీ నూకరత్నంను కూడా పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. నాలుగు రోజుల క్రితం కమిషనర్ జారీచేసిన ఉత్తర్వులను విశాఖలోని పాఠశాల విద్యా శాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్ రెండు రోజుల క్రితం సంబంధిత వ్యక్తుల (అప్పలనాయుడు మినహాయింపు)కు అందజేశారు. సస్పెన్షన్‌కు గురైన అధికారిణి, పీఈటీలు హెడ్‌క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. విశాఖపట్నం, భీమిలి డిప్యూటీ డీఈవో బాధ్యతలను తాత్కాలికంగా చినగదిలి ఎంఈవో-1 రవీంద్రకు అప్పగించారు.

జీవీఎంసీ పరిధిలో 149 పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టే బాధ్యతను ఇస్కాన్, అక్షయ పాత్రకు అప్పగించారు. అయితే 2019 జూన్ 17న ఇస్కాన్ సంస్థకు రవాణా చేసే బియ్యం పక్కదారి పట్టినట్టు అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో విజిలెన్స్ విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా ఉండే సువర్ణ నిర్లక్ష్యంగా ఉన్నారంటూ ఆమెకు ... మిగతా 4వ పేజీలో

ఇంటింటా జ్వరాలు

- ఫ్లూ వైరస్ ప్రభావంతో వ్యాప్తి
- ఐదు నుంచి వారం రోజులపాటు ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు, తలనొప్పి
- తీవ్రమైన నీరసం
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్య నిపుణులు
- ఇంట్లో ఒకరికి వస్తే మిగిలిన వారికి దూరంగా ఉండడం మంచింది



విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో వైరల్ ఫీవర్స్ విజృంభిస్తున్నాయి. గడిచిన మూడు వారాల నుంచి అసాధారణ స్థాయిలో జ్వరాలు నమోదవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఫ్లూ వైరస్ వ్యాప్తి చెందుతుందంటున్నారు.

ప్రస్తుతం నగరంతోపాటు గ్రామీణ ప్రాంతంలోనూ ఇంటికొకరు జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల డెంగ్యూ తరహా లక్షణాలు కనిపిస్తున్నాయి. డెంగ్యూ పరీక్ష చేయిస్తే మాత్రం నెగెటివ్ వస్తోంది. వైరల్ ఫీవర్ గానీ, డెంగ్యూ తరహా జ్వరాలు కానీ ఐదు నుంచి వారంపాటు ఉంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. దాదాపు 60 శాతం మందికి సాధారణ జ్వర మాత్రలతో తగ్గుముఖం పడుతుండగా, 30 శాతం మందికి మాత్రమే యాంటీ బయాటిక్స్ అవసరం అవుతున్నట్టు పేర్కొంటున్నారు. ఇంట్లో ఒకరికి వస్తే మిగిలిన వారికి వ్యాప్తి చెందుతోందని, తగిన జాగ్రత్తలు అవసరమని సూచిస్తున్నారు. ఇంట్లో పిల్లలు ఉంటే మాత్రం మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. జ్వరం తగ్గేంత వరకు ఇంట్లో మిగిలిన వారికి దూరంగా ఉండాలని చెబుతున్నారు.

ఇవీ లక్షణాలు..

వైరల్ ఫీవర్స్ బారినపడుతున్న వారిలో జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, తీవ్రమైన జ్వరం ఉంటున్నాయి. ఈ లక్షణాలతో కూడిన జ్వరం సాధారణంగా ఐదు నుంచి వారం రోజులు ఉంటోంది. జ్వరం తగ్గిన తరువాత కూడా నీరసం కనీసం వారం నుంచి పదిరోజులపాటు వేధిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. జ్వరంగా ఉండడం వల్ల చాలా మంది ఆహారం తీసుకోవడం మానేస్తున్నారని, దీనివల్ల మరింత నీరసపడుతున్నారంటున్నారు. జ్వరం, ఇతర ఇబ్బందులు ఉన్నా సకాలంలో వేడి ఆహారాన్ని తీసుకోవాలని, నిరంతరం వేడి నీటిని తీసుకోవాలని సూచిస్తున్నారు. కొందరిలో డెంగ్యూ మాదిరిగా కళ్లు ఎర్రగా ఉండడం, శరీరంపై ఎర్రని దద్దుర్లు, పొక్కులు వస్తున్నాయి. కొందరిలో ప్లేట్‌లెట్స్ కూడా తగ్గుముఖం పడుతున్నాయి. వీరిలో గొంతునొప్పి, దగ్గు, గొంతు మంట, ఒళ్లు నొప్పులు ఉంటు న్నాయి. ఈ తరహా జ్వరాలు కూడా వారం రోజుల్లో తగ్గుముఖం పడుతున్నాయి.

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి

- డాక్టర్ సోమయాజులు, జనరల్ ఫిజీషియన్

జ్వరాలు గతంతో పోలిస్తే చాలా ఎక్కువగా కనిపిస్తున్నాయి. జ్వరం తగ్గిన తరువాత నీరసం ఎక్కువగా ఉంటోంది. వారం రోజుల్లో జ్వరం తగ్గుముఖం పడుతోంది. యాంటీ బయాటిక్స్ వినియోగించాల్సిన అవసరం లేదు. కొందరికి మాత్రం తప్పడం లేదు. పోషకాలతో కూడిన వేడి ఆహారం, పండ్లు తీసుకోవడం ద్వారా వేగంగా కోలుకోవచ్చు. ద్రవపదార్థాలు తీసుకోవడం మంచిది. కొందరిలో డయేరియా సమస్య కూడా కనిపిస్తోంది. ఎక్కువ లక్షణాలు వేధిస్తే మాత్రం వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి.

అధికారుల హెచ్చరిక బేఖాతరు

- సాగరమిత్రల కళ్లు గప్పి సముద్రంలో వేటకు మత్స్యకారులు

- 4వ పేజీలో

ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,

9985411639

ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.

9985411029

94.45% మందికి పింఛన్లు పంపిణీ



తాటిచెట్లపాలెంలో పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సచివాలయ కార్యదర్శులు శనివారం జోరువానలో పింఛన్లు పంపిణీ చేశారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ నగరంలోని తాటిచెట్లపాలెంలో పలువురు వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు అందజేశారు. సాయంత్రం వరకూ అందిన సమాచారం ప్రకారం జిల్లాలో 1,62,941 మంది పింఛనుదారులు ఉండగా 1,53,896 మంది (94.45 శాతం)కి రూ. 66,11,89,000 పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతంలో 27,056 మందికి గాను 25,752 మందికి (95.15 శాతం), నగరంలో 1,35,885 మందికిగాను 1,28,144 మందికి (94.3 శాతం) పెన్షన్లు పంపిణీ చేశారు. మిగిలిన వారికి సోమవారం అందజేయనున్నారు.

21 మంది సీఐల బదిలీ

- నగరంలో పనిచేస్తున్న పది మందిని రేంజ్‌కు సరండర్ చేసిన సీపీ

రేంజ్‌లో 15 మంది సీఐల బదిలీ

- డీఐజీ ఉత్తర్వులు

వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్‌గా కె.రమేశ్

- మునిసిపల్ రీజనల్ డైరెక్టర్‌గా వి.రవీంద్ర

- వార్తలు 4లో

డీఎంహెచ్‌వోకు షోకాజ్ నోటీసులు


- మరో ముగ్గురు కార్యాలయ ఉద్యోగులకు చార్జ్‌మెమోలు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కోర్టు కేసులకు సంబంధించిన వ్యవహారాల్లో సరిగా స్పందించడం లేదంటూ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులపై రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారులు ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. ఈ మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావుకు షోకాజ్ నోటీస్, కార్యాలయంలో పనిచేసే ఏవో, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్‌లకు చార్జ్‌మెమోలు జారీచేశారు. కొద్దిరోజుల కిందట ఈ నోటీసులు వచ్చాయి. అయితే, ఆలస్యంగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కరోనా సమయంలో వ్యాక్సిన్ వికటించి మధురవాడ ప్రాంతానికి చెందిన ఆరోగ్య సిబ్బంది ఒకరు మృతిచెందారు. మృతురాలి కుటుంబ సభ్యులు దీనిపై కోర్టును ఆశ్రయించారు. ఈ కేసుతోపాటు మరికొన్ని వ్యవహారాల్లో జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో రాష్ట్రస్థాయి అధికారులు కోర్టు ముందు హాజరుకావాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఉన్నతాధికారులు నోటీసులు జారీచేశారు.

బాధితునికి ఆర్థిక సాయం

మర్రిపాలెం: మర్రిపాలెం శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్న ఈసరపు వెంకీనాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నీరుకొండ దివాకర్ శనివారం బాధితునికి ఇంటికి వెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో 53, 54 వార్డుల జనసేన అధ్యక్షుడు వింజూమూరి భాస్కర్, తాటిపాకల మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.











ఏ ఆరోగ్య కేంద్రంలో చూసినా జ్వరపీడితులే ...

» రోజుకు 100కు చేరువగా ఓపీ

అక్కయ్యపాలెం, ఆగస్టు 31: అక్కయ్యపాలెం పరిధిలో సీజనల్ జ్వరాల ప్రభావం తీవ్రంగా ఉంది. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీ విద్యుత్‌నగర్, 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు వీరి తాకిడి ఎక్కువగా కనిపిస్తోంది. ఈ రెండు ఆస్పత్రులకు రోజుకు 170 మంది జ్వర పీడితులు వస్తున్నారు. వాతావరణ మార్పులు, నీటి కలుషితంతో రోగాల బారిన పడుతున్నవారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఆస్పత్రుల్లో జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించిన మీదుట చికిత్స అందిస్తున్నారు. ఒక్కో ఆస్పత్రిలో వైద్యుడు (మెడికల్ ఆఫీసర్), ఒక ఫార్మసిస్టు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అటెండర్ సేవలందిస్తున్నారు.



కౌంటర్ వద్ద రోగులు

ఇరుకు భవనంతో అవస్థలు

గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీ విద్యుత్‌నగర్‌లోని ఆస్పత్రి ఇరుకు గదుల్లో కొనసాగుతోంది. ఇక్కడికి సరఫరా అయిన మందులను ఎక్కడ భద్రపరచాలో తెలియనిస్థితి నెలకొంటోందని సిబ్బంది చెబుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన మందుల స్టాక్ మొత్తం ఒకే గదిలో పేర్చాల్సి వస్తోంది.

వాతావరణం మార్పుతోనే జ్వరాలు



వాతావరణం మార్పు వల్ల జ్వరాలు ప్రబలుతున్నాయి. రోగ నిర్ధారణ చేశాక మెరుగైన వైద్య మందిస్తున్నాం. ఆస్పత్రికి వచ్చిన వారందరికీ మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. ఆస్పత్రిలో 43 రకాల రోగనిర్ధారణ పరీక్షలు, వివిధ రకాల వ్యాధులకు మందులుఅందుబాటులో ఉన్నాయి. ఔట్ పేషంట్లలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వా రి సంఖ్య ఎక్కువ శాతం ఉంది.

- సుధీర్, మెడికల్ ఆఫీసర్, ఆయుష్మాన్ ఆరోగ్య కేం ద్రం విద్యుత్‌నగర్

ఉత్తమ సేవలందించిన పోలీసు సిబ్బందికి రివార్డులు

మహారాణిపేట, ఆగస్టు 31: విధుల్లో ఉత్తమ పనితీరు చూపిన పోలీసు సిబ్బందికి నగర కమిషనర్ శంఖ బ్రత బాగ్చీ రివార్డులు అందించారు. శనివారం పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆగస్టులో ఉత్తమ సేవలందించిన 92 మంది పోలీసు సిబ్బందికి గుర్తించి ఈ రి వార్డులను అందించి ప్రోత్సహించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ, హోంగార్డు స్థాయి సీఐ స్థాయి అధికారుల వరకు వారు నిర్వహిస్తున్న విధుల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతినెలా ప్రోత్సహిస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణా నిరోధం, చోరీ సొత్తు రికవరీ, చిన్న పిల్లల అక్రమంగా ఇతర రాష్ట్రాలకు అమ్మకాలు చేస్తున్న ముఠా అరెస్టు, తప్పిపోయిన బాలికల ఆచూకీ గుర్తింపు తదితర కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన సిబ్బందిని పోలీసు అధికారుల సమక్షంలో అభినందనలు తెలిపారు.

పదవీ విరమణ చేసిన పోలీసు సిబ్బందికి సన్మానం

ఈసందర్భంగా పోలీసు శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఎనిమిది మంది సిబ్బంది కమిషనర్ శంఖ బ్రాత బాగ్చీ ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ చేసిన వారిలో ఏడీసీపీ కె. ప్రభాకర్, పి. నూకన్న, డి.వి. అప్పారావు, బి. అప్పారావు. బి.వి. సత్యనారయణ, కె. అశోక్ కుమార్, ఎం.వి.ఎస్.ఎస్. రాజు, టి. బాబూరావు తదితరులున్నారు.

ఫింఛన్ల పంపిణీని పూర్తి చేయాలి: కలెక్టర్


పింఛను అందిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

అక్కయ్యపాలెం, ఆగస్టు 31: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్‌ఎంఎన్ హరేంధిర ప్రసాద్ భాగస్వాములయ్యారు. ఒక్కరోజు ముందుగానే చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 45వ వార్డు తాటిచెట్లపాలెంలో పలువురు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలెక్టర్ కలిసి పింఛన్ల మొత్తాన్ని అందజేశారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని డీఆర్డీఏ, యూసీడీ పీడీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కంపా హనోక్, టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు, డీఆర్డీఏ పీడీ శోభారాణి, యూసీడీ పీడీ ఫణిరాం, ఏపీడీ పద్మావతి, సచివాలయ ఉద్యో గులు పాల్గొన్నారు.

జోరు వానల్లోనూ పెన్షన్ల పంపిణీ

మాధవధార; రాష్ట్ర చరిత్రలో సామాజిక పెన్షన్లను ఒక రోజు ముందుగా అందించి న ఘనత ముఖ్యమం త్రి చంద్రబాబు సర్కారుకే దక్కుతుందని టీడీపీ 51వవార్డు అధ్యక్షులు సనపల.కీర్తి అన్నారు. శనివారం 51వవార్డు సీతన్న గార్డెన్స్‌లో ఆయన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు. 50వవార్డులో ఎమ్మెల్సీ దువ్వారపు.రామారావు, వార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్ తదితరులు వానలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు అందించారు.మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మర్రిపాలెం: గ్రేటర్ 53వ వార్డులో విశాఖ పా ర్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు సచి వాలయ సిబ్బందితోపాటు పలకాలనీలకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు.

మదర్ థెరిసా హోంకు నలుగురు తరలింపు

అక్కయ్యపాలెం, ఆగస్టు 31: అనాథలైన నలుగురు మహిళలను మ దర్ థెరిసా హోంలో చేర్పించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దిక్కుతోచని స్థితిలో ఉన్న సుంకమ్మ (70), లాంచన్ (40)ను, కిరణ్మయి (40)ని రైల్వే స్టేషన్ నుంచి, రాంబాయి (65)ను అడవివరం నుంచి రెస్క్యూ చేసి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని మహిళా షెల్టర్‌లో ఆశ్రయం కల్పించినట్టు చెప్పారు. నెల రోజులుగా వీరి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసినా ఫలితంలేకపోయిందన్నారు. సీఐ తిరుమలరావు ధ్రువీకరించి ఇచ్చిన లేఖ తీసుకుని హోంలో చేర్పించి ఆ శ్రయం కల్పించినట్టు పేర్కొన్నారు.

ఇండియన్ బ్యాంక్ సర్ఫాసీ అసెట్స్ ఫెయిర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జోనల్ మేనేజర్ అవధేష్ కుమార్ పుర్వే

సీతంపేట, ఆగస్టు 31: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం విశాఖపట్నం ఆధ్వర్యంలో సర్ఫాసీ చట్టం పరిధిలో అసెట్స్ (ఆస్తులు) ఫెయిర్-2024 కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనను ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ అవధేష్ కుమార్ పుర్వే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ అసెట్స్ ఫెయిర్‌లో విశాఖపట్నం, రాజమహేంద్రవరం రెండు జోన్‌లకు సంబంధించిన ఎన్‌పీఏ (నిరర్థక ఖాతాలు) పరిధిలోని ఆస్తులను సంబంధించిన వాటిని ఉంచినట్లు తెలిపారు. ఆస్తుల్లో నివేశన ప్లాట్స్, స్థలాలు, గృహాలు, ప్రారిశ్రామిక, వాణిజ్య ఆస్తులు సుమారు 100కు పైగా ఉన్నట్టు వివరించారు. ఆసక్తి ఉన్నవారు వీటి వివరాల కోసం సమీపంలోని ఇండియన్ బ్యాంక్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ ఆస్తులన్నీ ఆక్టోబరులోగా విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్టు రికవరీ చీఫ్ మేనేజర్ అజీముద్దీన్ అహ్మద్ ఇర్ఫాన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ అసెట్స్ ఫెయిర్‌లో ఇండియన్ బ్యాంక్ శాఖల సిబ్బంది, వివిధవర్గాల ప్రజలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

'శ్రావణ్' బాధితులకు ప్రముఖుల పరామర్శ


బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 31: శ్రావణ్ షిప్పింగ్ గొడౌన్‌లో శుక్రవారం అసిటానిలైడ్ అనే రసాయన పౌడర్‌ను పీల్చి తీవ్ర అస్వస్థతకు గురై షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధి తులను శనివారం పలువురు అధికారులు, నాయకులు పరామర్శించారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు,కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, ఏసీపీ త్రినాథ్‌లు బాధితులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం సేవలందించాలని వైద్యులకు వారు సూచించారు. అలాగే బాధితు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. కాగా అస్వస్థతకు గురైన గోతిరెడ్డి దేముడుబాబుతో పాటు పి.కుమారి, రాము, లక్ష్మీ కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. అయితే గంగ్రెడ్డి లత ఆరోగ్య పరిస్థితి కాస్త విషమంగా ఉన్నందున శస్త్రచికిత్స చేయనున్నట్టు పేర్కొన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటువారిని 'శ్రావణ్' యాజమాన్యం ఆదుకోవాలని సీపీఐ నాయకుడు కె.సత్యనారాయణ, సీఐటీయూ నేతలు ఎం.రాంబాబు, ఎ.లోకేశ్‌లు డిమాండ్ చేశారు.

మిజోరాం గవర్నర్ హరిబాబుకు సత్కారం


హరిబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, ఆగస్టు 31: మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబును ఉత్తర నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు, నార్త్ కన్వీనర్ సురేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరిబాబుకు వాలువాతో విష్ణుకుమార్ రాజు సత్కరించారు.

21 మంది సీఐల బదిలీ

» నగరంలో పనిచేస్తున్న పది మందిని రేంజ్‌కు సరండర్ చేసిన సీపీ

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల పరంపర కొనసాగుతోంది. తొలివిడతలో 26 మంది సీఐలను బదిలీ చేసిన సీపీ శంఖబ్రతబాగ్చి శనివారం మరో 21 మంది సీఐలను బదిలీ చేశారు. నగరంలో పనిచేస్తున్న సీఐల్లో పది మందిని రేంజ్‌కు సరండర్ చేసి, వారిస్థానంలో రేంజ్ పరిధిలో పనిచేస్తున్న వారిని నగరానికి తీసుకున్నారు.

వ.నం	పేరు	ప్రస్తుతం పనిచేస్తున్నచోటు	బదిలీ అయిన స్థానం
1.	లడ్డు రామకృష్ణ	పెందుర్తి	రేంజ్ వీఆర్
2.	వై.రామకృష్ణ	పీఎంపాలెం	రేంజ్ వీఆర్
3.	పి.శోభన్‌బాబు	సీసీఎస్-3	రేంజ్ వీఆర్
4.	డి.రమేష్	భీమిలి	రేంజ్ వీఆర్
5.	కర్రి వెంకట సతీష్‌కుమార్	ఏసీబీ	పెందుర్తి
6.	గేదెల బాలకృష్ణ	రేంజ్ వీఆర్	పీఎంపాలెం
7.	ఎన్.గోపాలరావు	సీపీఎస్-2	రేంజ్ వీఆర్
8.	ఆర్.మల్లికార్జునరావు	రేంజ్ వీఆర్	టాస్క్‌ఫోర్స్ జోన్-1
9.	బొడ్డేపల్లి సుధాకర్	ఏఎస్‌ఆర్ జిల్లా సైబర్‌సెల్	భీమిలి
10.	వెలగాడ శంకరనారాయణ	ఏఎస్‌ఆర్ జిల్లా సీసీఎస్	సీసీఎస్-3
11.	డీవీ రమణ	ఇంటెలిజెన్స్	ద్వారకా పీఎస్
12.	కిల్లి వెంకటరావు	జీఆర్‌పీ	సౌత్ ట్రాఫిక్
13.	ఎనుకోటి కేశవరావు	ఇంటెలిజెన్స్	స్టీల్‌ప్లాంట్
14.	వి.శ్రీనివాసరావు	స్టీల్‌ప్లాంట్	రేంజ్ వీఆర్
15.	వి.గోపీనాథ్	పీసీఆర్	రేంజ్ వీఆర్
16.	కె.రామారావు	రేంజ్ వీఆర్	సీసీఎస్-2
17.	గంగుల గోవిందరావు	ఆరిలోవ	రేంజ్ వీఆర్
18.	హెచ్.మల్లేశ్వరరావు	ఏఎస్‌ఆర్ జిల్లా డీసీఆర్‌బీ	ఆరిలోవ
19.	షేక్ మహ్మద్ హుస్సేన్	రేంజ్ వీఆర్	పీసీఆర్
20.	ఎస్.రమేష్	ద్వారకా పీఎస్	రేంజ్ వీఆర్
21.	వానపల్లి నాగరాజు	సౌత్‌ట్రాఫిక్	రేంజ్ వీఆర్

నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది: ఎమ్మెల్యే వంశీకృష్ణ

సిరిపురం, ఆగస్టు 31: నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో సెయింట్ జోసెఫ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ 35వ క్యాపింగ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై డాక్టర్లు సుధాకర్, సునీత, మురళీ సంతోష్, పల్లా దుర్గారావుతో కలిసి జ్యోతి ప్రజల్వనగావించారు. కాలేజీ చైర్మన్ డాక్టర్ సునీతరెడ్డి, డైరెక్టర్స్ అనిత, శ్రీకాంత్, సిరట్ల వాసు, నర్సింగ్ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి, భవాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నర్సింగ్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బ్రహ్మకుమారీస్ సేవలు భేష్


బ్రహ్మకుమారీస్ ప్రతినిధులతో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్, ఆగస్టు 31: బ్రహ్మకుమారీస్ సేవలు అద్భుతమని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. శనివారం జీవీఎంసీ కమిషనర్ ఛాంబర్‌లోని బ్రహ్మకుమారీస్ ఎంవీపీ కాలనీ బ్రాంచ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. బ్రహ్మకుమారీస్‌కు జీవీఎంసీ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే రామేశ్వరి, జీవీఎంసీ ఏడీసీ వై.శ్రీనివాసరావు, పావని, మణి, రోశన్ని, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్యాచరణతో నగరాభివృద్ధి: కమిషనర్

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు మౌలిక సదుపాయాలపరంగా మరింత అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో 1.18 లక్షల వీధి దీపాలు ఉండగా, ప్రతిరోజూ ఐదువేల లైట్లు చోరీ/ధ్వంసం జరుగుతుండడంపై పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేక నిఘా పెట్టడంతో సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. నగరంలో పది శాతం వరకు వీధి లైట్లు రోజూ వెలగడం లేదని, ఈ సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత ఏజెన్సీని పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించామన్నారు. తాగునీటి సరఫరా పైప్‌లైన్లు 390 చోట్ల గెడ్డలను క్రాసింగ్ చేస్తున్నాయని, ఇందులో 345 చోట్ల పైప్‌లైన్లను వేరేమార్గాలకు మళ్లించగా, మిగిలినవి నాలుగైదు రోజుల్లో బైపాస్ చేస్తామన్నారు. ప్రతి వ్యక్తికి 135 ఎల్‌పీసీడీ నీటిని సరఫరా చేయాల్సిఉండగా, ప్రస్తుతం 115 ఎల్‌పీసీడీ నీటిని అందిస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో వ్యాధులు విజృంభించకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రజారోగ్యానికి ఇబ్బంది లేకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామన్నారు.

అధికారుల హెచ్చరిక బేఖాతరు

» సాగరమిత్రల కళ్లు గప్పి సముద్రంలో వేటకు మత్స్యకారులు
» బోటు గల్లంతు..కుటుంబ సభ్యుల ఆందోళన
» గంగవరం నుంచి సురక్షితంగా తరలింపు


క్షేమంగా చేరిన మత్స్యకారులతో మాట్లాడుతున్న జేడీ విజయ

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వర్షాల సమయంలో వేట తగదని అధికారులు హెచ్చరిస్తున్నా మత్స్యకా రులు వినడం లేదు. జీవనోపాధి అంటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడి గత మూడు రోజులుగా సముద్రం అల్లకల్లోలంగా ఉంది. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. అయినా సరే కొందరు మత్స్యకారులు వేటకు వెళ్లిపోతున్నారు. దాంతో అధికారులు ప్రతి ల్యాండింగ్ సెంటర్‌లో పూటకు ఇద్దరు చొప్పున సాగర మిత్రలను కాపలా ఉంచి ఎవరూ వేటకు వెళ్లకుండా చూస్తున్నారు. వారి కళ్లు గప్పి కొందరు బోట్లు వేసుకొని వేటకు వెళుతున్నారు. ఇలాగే శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు పెదజాలరిపేటకు చెందిన ఐఎన్‌డి-ఏపీ-వి1-ఎం-1214 నంబరు బోటులో పొట్టి రాజు, తెడ్డు పోలరాజు, చింతపల్లి అనుదాసు అనేవారు వేటకు వెళ్లారు. మధ్యాహ్నానికి తిరిగి రావాలి. కానీ సాయంత్రం అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు చెప్పడంతో ఆయన మత్స్య శాఖ జేడీ విజయకు చెప్పారు. వెంటనే అన్ని రేవులకు సమాచారం పంపించి వివరాలు సేకరించారు. వేటకు వెళ్లిన ముగ్గురు సముద్రంలో అల్లకల్లోలంగా ఉండడంతో వెనక్కి రాలేక గంగవరం వైపు వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడానికి మొబైల్ ఫోన్లు ఛార్జింగ్ అయిపోవడంతో వీలు కాలేదు. అక్కడ కాకినాడకు చెందిన బోటు కనిపించడంతో వారి ఫోన్ తీసుకొని సమాచారమిచ్చారు. వెంటనే విషయం తెలుసుకున్న అధికారులు గంగవరం వెళ్లి బోటుతో సహా వారిని పెదజాలరిపేటకు శనివారం రాత్రి ఏడు గంటలకు తీసుకువచ్చారు.

వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్‌గా కె.రమేశ్

మునిసిపల్ రీజనల్ డైరెక్టర్‌గా వి.రవీంద్ర

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న వి.రవీంద్రను మునిసిపల్ రీజనల్ డైరెక్టర్ కమ్ అప్పిలేట్ కమిషనర్ (విశాఖ)గా ప్రభుత్వం బదిలీ చేసింది. విజయవాడ సీఆర్‌డీఏలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కె.రమేశ్‌ను వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్‌గా నియమించింది. గతంలో కూడా రమేశ్ వుడా అడిషనల్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు.


15 మంది సీఐల బదిలీ

» విశాఖ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రేంజ్ పరిధిలో 15 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ డీఐజీ గోపినాథ్ జట్టి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు.

వరుస నంబర్/పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న చోటు	బదిలీ అయిన స్థానం
1. పి.పైడపునాయుడు	రేంజ్ వీఆర్	కె.కోటపాడు
2. నమ్మి గణేష్	అనకాపల్లి పీసీఆర్	అచ్యుతాపురం యూపీఎస్
3. ఎం.బుచ్చిరాజు	అచ్యుతాపురం యూపీఎస్	రేంజ్ వీఆర్
4. బి.చిన్నస్వామినాయుడు	కె.కోటపాడు	శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్
5. ఎం.వినోద్‌బాబు	రేంజ్ వీఆర్	అనకాపల్లి సోషల్ మీడియా సైబర్‌సెల్
6. ఎల్.రేవతమ్మ	సిటీ నుంచి రేంజ్ వీఆర్	నర్సీపట్నం రూరల్
7. డి.దీనబంధు	రేంజ్ వీఆర్	పాడేరు యూపీఎస్
8. డి.నవీన్‌కుమార్	పాడేరు యూపీఎస్	ఏఎస్‌ఆర్ జిల్లా సీసీఎస్
9. వెలగాడ శంకరనారాయణ	ఏఎస్‌ఆర్ జిల్లా సీసీఎస్	రేంజ్ వీఆర్
10. ఎస్.బాలసూర్యారావు	పరవాడ యూపీఎస్	అనకాపల్లి డీఎస్‌బీ-1
11. ఆర్.మల్లికార్జునరావు	రేంజ్ వీఆర్	పరవాడ యూపీఎస్
12. వి.చక్రధరరావు	సిటీ నుంచి రేంజ్ వీఆర్	విజయనగరం డీసీఆర్‌బీ
13. బెండి వెంకటరావు	రేంజ్ వీఆర్	విజయనగరం టాస్క్‌ఫోర్స్
14. జి.అప్పన్న	నక్కపల్లి	పాయకరావుపేట యూపీఎస్
15. జి.అశోక్‌కుమార్	రేంజ్ వీఆర్	అనకాపల్లి రూరల్

బీచ్‌లో కూలిన మెట్లు


కూలిన మెట్లు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిలేని వర్షాలకు శనివారం బీచ్‌రోడ్‌లో కాళీమాత గుడి ఎదురుగా బీచ్‌లోనికి వెళ్లే మెట్లు కూలిపోయాయి. రోడ్డు నుంచి సముద్రంలోనికి వెళ్లేందుకు ఒకవైపు ర్యాంపు, దానికి ఆనుకుని మెట్లు ఉ న్నాయి. మూడు రోజులుగాకురుస్తున్న వర్షాలకు మెట్లు కూలిపోయాయి.వీటికి ఆనుకుని గోడ ప్ర మాదకరంగాఉండటంతో పలువురు వాకర్లుఆందోళన వ్యక్తంచేశారు.

ఇద్దరికీ హెల్మెట్ తప్పనిసరి

... 3వ పేజీ తరువాయి

పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తారన్నారు. బైక్ నడిపిన వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ పెట్టుకోని పక్షంలో రూ.135 ఈ-చలాన్ జారీచేయడంతోపాటు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను స్వాధీనం చేసుకుని రవాణా శాఖ అధికారులకు పంపిస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కార్డు అందుబాటులో లేకపోతే వారి డ్రైవింగ్ లైసెన్స్ నంబర్‌ను ఆర్‌టీఏ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. రవాణా శాఖ అధికారులు డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నెలలు వరకూ సస్పెండ్ చేసే అవకాశం ఉంటుందన్నారు. నగరంలో ద్విచక్ర వాహనాలను నడిపే వారంతా ఈ విషయాన్ని గమనించాలని సీపీ విజ్ఞప్తిచేశారు.

రహదారులు ఛిద్రం

... 3వ పేజీ తరువాయి

వెళ్లే రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనచోదకులు నరకం చూడాల్సి వస్తోంది. ఈ విధంగా దెబ్బతిన్న రోడ్లలో కొద్దిరోజుల కిందట నిర్మించినవి కూడా ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మద్దిలపాలెంలోని కళాభారతి రోడ్డును కొద్దినెలల కిందటే నిర్మించగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పలుచోట్ల కుంగిపోయింది. అదేవిధంగా అక్కయ్యపాలెం, వన్‌టౌన్ ప్రాంతాల్లో ఇటీవలే నిర్మించిన రోడ్లు కూడా దెబ్బతినడం చూస్తే నిర్మాణంలో నాణ్యతపై అనుమానాలు కలుగుతున్నాయి. నిర్మాణంలో నాణ్యత లోపించడం వల్లే చిన్నపాటి వర్షానికి రోడ్లు పాడైపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తనిఖీలపై తాత్సారం

... 3వ పేజీ తరువాయి

గొడౌన్‌లో కూడా ఇలాంటిదే జరిగింది. రసాయన పౌడర్ బస్తాలను దించుతూ వాటి వాసన పీల్చడం వల్ల ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. పరిశ్రమలో పనిచేసే సిబ్బందికి పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ అందజేసి, తప్పనిసరిగా వాటిని ధరించాకే విధుల్లోకి అనుమతించాల్సి ఉంది. ప్రాథమిక జాగ్రత్తలో ఇది మొదటిది. దీనిని కూడా ఎవరూ అమలు చేయడం లేదు.

ఎసెన్షియా ప్రమాదం తరువాత అన్నీ పరిశ్రమల్లో వారం రోజుల్లో ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్లు ఆదేశించారు. వారం గడిచినా ఇప్పటివరకు ఈ కార్యక్రమానికి ఇంకా శ్రీకారమే చుట్టలేదని తెలిసింది. సెప్టెంబరు మూడో తేదీ నుంచి మొదలు పెడతామని సంబంధిత పరిశ్రమల శాఖ అధికారులు తెలిపారు. వీటికి కమిటీల నియామకం, తనిఖీల విధానం వంటిని సూచించాల్సి ఉందని తెలిసింది. అత్యధిక పరిశ్రమలు కలిగిన జిల్లాలో ఇంటర్నల్ ఆడిట్ ఎలా చేయాలనే దానిపై కూడా ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన అవసరం వచ్చిందంటే..ఈ తనిఖీలు, నివేదికలు ఎలా జరుగుతున్నాయో కలెక్టర్లు సీరియస్‌గా ఆలోచించాల్సి ఉంది. మరో ప్రమాదం జరగక ముందే పరిశ్రమల్లో తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. మూకుమ్మడిగా పరిశ్రమల్లో పనిచేసే వారికి అవగాహన, శిక్షణ కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాల్సి ఉంది. గేటు దాటి లోపలికి వెళితే తప్పనిసరిగా మాస్క్, హెల్మెట్, బూట్లు, చేతికి గ్లోవ్స్ ఉండేలా చూడాలి.

పెందుర్తి ఎంఈవో-1 సువర్ణ సస్పెన్షన్

... 3వ పేజీ తరువాయి

అప్పటి డీఈవో షోకాజ్ జారీచేశారు. అందుకు ఏడాది ముందు మెమో జారీచేశారు. కాగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారించి గత ఏడాది సెప్టెంబరు 13న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక మేరకు పాఠశాల విద్యా శాఖ చర్యలు తీసుకునేందుకు ఏడాది సమయం పట్టింది.



'మేహాద్రిగెడ్డ'కు జలకళ

49 అడుగులకు చేరిన నీటి మట్టం

గోపాలపట్నం, ఆగస్టు 31: మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం 49 అడుగులకు చేరింది. నెల రోజుల క్రితం వరకూ 46 అడుగులు ఉన్న నీటిమట్టం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మూడడుగుల మేర పెరిగింది. రిజర్వాయర్‌లో పూడికతీత పనులు చేపట్టకపోవడం, గత ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేక, ఈ ఏడాది ప్రారంభం నాటికే రిజర్వాయర్‌లో నీటిమట్టం తక్కువగా ఉంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 61 అడుగులు కాగా, ఈ ఏడాది ప్రారంభంలో 48 అడుగులు ఉంది. రిజర్వాయర్ కనిష్ఠ నీటిమట్టం 44 అడుగుల కాగా, గత వేసవి ముగిసే సమయానికి 46.2 అడుగులకు పరిమితమైంది. రిజర్వాయర్ నీటిమట్టం 59 అడుగులకు చేరితే తప్ప గేట్లు ఎత్తే అవకాశం లేదు.

సింహాద్రి అప్పన్న స్వామి 32 రూపాల పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న అశోక్‌గజపతిరాజు, తదితరులు

సింహాచలం, ఆగస్టు 31: వరాహలక్ష్మీనృసింహ స్వామి ప్రహ్లాదుడిని రక్షించే సమయంలో వైరితో చేసిన యుద్ధంలో స్వీకరించిన 32 రూపాల గురించి పుస్తకాన్ని ప్రచురించినట్టు ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తెలిపారు. ఈ పుస్తకాన్ని శనివారం సాయంత్రం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు విజయనగరంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వేదపండితులు, పుస్తక రూపశిల్పి కేతినేడి సాయికుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రి లోకేశ్‌కు వినతి

అగనంపూడి, ఆగస్టు 31: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ నగరంలో కలిసి పలు సమస్యలపై వినతిప్రతం అందజేశారు. అర్హులందరికీ టిడ్కో ఇళ్ల కేటాయించేందుకు విధంగా చొరవ చూపాలని, ఫార్మాసిటీ కారణంగా లంకెలపాలెం, అగనంపూడి ప్రాంతాల ప్రజలు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నందున పొల్యూషన్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లంకెలపాలెం కూడలిలో అన్న క్యాంటీన్ ఏర్పాటుతో పాటు కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయా సమస్యలపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించినట్టు కార్పొరేటర్ తెలిపారు.

ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం



హెచ్ఎం పద్మావతి దంపతులను సత్కరించిన ఎమ్మెల్సీ, తదితరులు

వేపగుంట, ఆగస్టు 31: వేపగుంట హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కొల్లి పద్మావతికి శనివారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా పదవీ విరమణ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు పాల్గొని హాజరై పద్మావతి, అచ్యుతరావు దంపతులకు సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** శ్రీకన్య, మెలోడి, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** శ్రీరామ, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **తంగలాన్ :** శారద, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 46, టమాటా 24, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 20, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 28, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 22, క్యారెట్ 34, దొండకాయలు 28, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 115, మునక్కాడలు (కిలో) 40, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 34, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 270, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 84, పొటల్స్ 36, కీరదోస 32, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 66, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	91
ఫారం ధర	--	111
విత్ స్కిన్	--	192
స్కిన్‌లెస్	--	202

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10లో



కూర్మన్నపాలెంలో జోరువాన కురుస్తున్న దృశ్యం



జనతా కాలనీలో రిటెయినింగ్ వాల్ కూలడంతో ధ్వంసమైన చర్చి



అగనంపూడిలో ఉధృతంగా ప్రవహిస్తున్న బొర్రమ్మ గెడ్డ

కుమ్మేసిన వాన

జనతా కాలనీలో రిటెయినింగ్ వాల్ కూలడంతో ధ్వంసమైన చర్చి

58వ వార్డులో ఇంటి గోడ కూలడంతో దెబ్బతిన్న పలు వాహనాలు

పలుచోట్ల జలమయమైన రహదారులు

వాహనదారులకు తప్పని తిప్పలు

పెదగంట్యాడ, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు జలమయమవుతున్నాయి. వర్షపు నీటి సామర్థ్యానికి తగ్గట్టుగా డ్రైనేజీలు లేకపోవడంతో నీరు రహదారులపై ప్రవహిస్తుంది. ఈ క్రమంలో పెదగంట్యాడ మహాత్మాగాంధీ జంక్షన్ నుంచి గంగవరం వెళ్లే రోడ్డులో పెద్దఎత్తున వర్షపు నీరు ప్రవహిస్తుంది. ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రధాన రహదారిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కాగా హెచ్‌బీ కాలనీ నుంచి పోర్టుకు వెళ్లే రోడ్డులో, వెంపల్లినగర్ రహదారిలో మోకాల్లోతు మేర నీరు నిలిచిపోయింది. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించడానికి పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో ఏకధాటిగా కురుస్తున వర్షాలతో పలుచోట్ల గోడల కూలాయి. మల్కాపురం ప్రధాన రహదారిలో మోకాల్లోతు వరకు వర్షపు నీరు చేరింది. ఇక్కడి పోలీస్ స్టేషన్‌లోకి వర్షపు నీరు పెద్దఎత్తున చేరడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. 60వ వార్డు పరిధి జనతా కాలనీ కొండవాలు ప్రాంతంలో ఉన్న రిటెయినింగ్ వాల్ నానిపోయి పక్కనే ఉన్న చర్చిపై కూలిపోయింది. దీంతో చర్చి మొత్తం ధ్వంసమైంది. అలాగే తాగునీటి సరఫరా చేసే పైప్‌లైన్ దెబ్బతినడంతో కొండవాల ప్రాంతాల వారికి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ సమస్య పరిష్కారానికి తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పీవీ సురేశ్ ఆదేశించారు. 58వ వార్డు శ్రీహరిపురంలోని రామ్‌నగర్‌లో ఓ ఇంటి గోడ కూలిపోవడంతో అక్కడ ఉన్న కొన్ని వాహనాలు నుజ్జయ్యాయి. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు. సంఘటనా స్థలాన్ని కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వైసీపీ నాయకుడు గులిగిందల కృష్ణ, టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి పొత్తబత్తుల శ్రీను, సచివాలయ సిబ్బంది సందర్శించి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా నౌసేనాభాగ్ ప్రధాన రహదారి వర్షపు నీటితో నిండిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించిన వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

అగనంపూడి: తెరిపివ్వకుండా కురుసున్న వర్షాలకు తప్పనిసరి అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. భారీ వర్షం కారణంగా ప్రధాన గెడ్డలన్నీ వరద నీటితో పొంగి ప్రవహించాయి. ముఖ్యంగా కొండవాగు నుంచి వచ్చే బొర్రమ్మ గెడ్డ నీటి ఉధృతి అధికంగా ఉండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. తలారివానిపాలెం, ఫార్మాసిటీ కాలనీల్లో గల వీధి రోడ్లు ధ్వంసమయ్యాయి. అలాగే జాతీయ రహదారి అగనంపూడి ఆస్పత్రి సమీపంలోని రోడ్డు కోతకు గురైంది. దువ్వాడ ప్రధాన రహదారిలో పెద్దఎత్తున వర్షపు నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్షం కారణంగా చాలామంది రోజువారి కార్మికులు ఇళ్లకే పరిమితమయ్యారు.



భారీ వర్షానికి అగనంపూడిలో కోతకు గురైన రోడ్డు



శ్రీహరిపురం రామ్‌నగర్‌లో కూలిపోయిన ఇంటి గోడ



పెందుర్తిలో జలమయమైన రహదారి

గాజువాక: తెరిపివ్వకుండా కురుస్తున్న వర్షానికి గాజువాకలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షానికి ఫుట్‌పాత్ వ్యాపారాలు సజావుగా సాగలేదు. ఉదయం విధులకు వ వెళ్లే ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వర్షంలో గొడుగులు, రెయిన్ కోట్లు వేసుకునం ముందుకు సాగారు. పాఠశాలలకు సెలవు ప్రకటించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కూర్మన్నపాలెం: భారీ వర్షాలతో జనజీవనం స్తంభించింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు కూడళ్లలోని రోడ్డు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, విధులకు వెళ్లిన ఉద్యోగులు, కార్మికులు గొడుగులు, రెయిన్ కోట్లను వినియోగించారు. వర్షం వల్ల అమ్మకాలు సజావుగా సాగలేదని పలువురు చిరు వ్యాపారులు పేర్కొన్నారు.

ఆటోనగర్: జోరువానకు రహదారులపై పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో ఆమా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఆటోనగర్ నుంచి యాదవ జగ్గరాజు పేట, శ్రీనివాస నగర్, పకీరుతఖ్యా, చినగంట్యాడ రహదారుల్లో పెద్దఎత్తున నీరు నిలిచిపోయింది. అలాగే శ్రీనగర్, వడ్లపూడి, తోకాడ కాలనీల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు తిష్ఠ వేయడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పెందుర్తి: తెరిపివ్వని వర్షాలకు పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి జలమయమైంది. నీరు ప్రవహించే మార్గం లేక రోడ్డు పైనే నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. బీఆర్టీఎస్ రోడ్డు నిర్మాణంలో కోర్టు వివాదంలో ఉన్న స్థలాల్లో డ్రైనేజీ నిర్మాణాన్ని అవసరాలకు తగ్గట్టుగా చేపట్టలేదు. దీంతో పెందుర్తి-విశాఖ రోడ్డు సమీపాన మురుగు, వర్షం నీరు రహదారిపై పొంగి ప్రవహిస్తోంది. ఫలితంగా జంక్షన్‌లో మోకాల్లోతు నీరు గంటలకొద్దీ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. ఇక్కడి నుంచి వార్డు కార్యాలయానికి జంక్షన్ మీదుగా యూజీడీ నిర్మాణం చేపడితే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు అంటున్నారు.

అక్కిరెడ్డిపాలెం: వర్షాలకు జాతీయ రహదారి నుంచి షీలానగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలోని హరిజన జగ్గయ్యపాలెం వద్ద కాలువలు నిండి రోడ్లపైకి మురుగు నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. వర్షాలు ఎప్పుడు కురిసినా హరిజన జగ్గయ్యపాలెం పరిసరాల్లోని లోతట్టు ముంపునకు గురవుతుంటాయి. అయితే ఈ ఏడాది పాత అవుట్‌లెట్‌కు అనుసంధానంగా హైవేకు ఆనుకుని డ్రైనేజీ నిర్మించడంతో ప్రస్తుతానికి వరద ముంపు తప్పడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆటోనగర్ నుంచి తుంగ్లాం వెళ్లే ప్రధాన రోడ్డులో, రామ్‌నగర్ రహదారిలో వర్షపు నీరు పెద్దఎత్తున నిలచిపోవడంతో స్థానికులకు అవస్థలు తప్పలేదు.



ఆటోనగర్ ఐలా కార్యాలయం వద్ద చెరువులా మారిన రోడ్డు



హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ డిల్హారిని గజమాలతో సత్కరిస్తున్న మహిళా న్యాయవాదులు

సమాజాభివృద్ధిలో స్త్రీ పాత్ర వెల కట్టలేనిది

హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ డిల్హారి

విశాఖపట్నం, ఆగస్టు 31: సమాజాభివృద్ధిలో స్త్రీ పాత్ర వెలకట్టలేనిదని హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ డిల్హారి అన్నారు. సిరిపురలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనా థియేటర్‌లో శనివారం వుమెన్ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'వుమెన్ అడ్వకేట్స్ ఉన్నతి' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ సంఘంలో వివక్షకు గురవుతున్న మహిళలకు వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వివక్షకు గురవుతున్న మహిళా న్యాయవాదుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు. సంఘంలో స్త్రీ ఔన్నత్యాన్ని పెంపొందించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు జడ్జి ప్రియదర్శిని, ఏపీ హైకోర్టు జడ్జిలు భానుమతి, చీమలపాటి రవి, విశాఖ జిల్లా న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, అసోసియేషన్ అధ్యక్షురాలు అనురాధ పప్పు, కార్యదర్శి పి.హేమమాలి, బెవర సత్యనారాయణ, డి.నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఎంవోయూ పత్రాలు చూపుతున్న ఇరు సంస్థల అధికారులు

ఇండియన్ మారిటైమ్‌తో షిప్‌యార్డు ఎంవోయూ

మల్కాపురం, ఆగస్టు 31: నౌకల నిర్మాణంలో మరింత నాణ్యతను పెంపొందించడానికి హిందుస్థాన్ షిప్‌యార్డు శుక్రవారం ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ అధికారులతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఇరు సంస్థల అధికారులు శనివారం సంతకాలు చేసి ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ మాట్లాడుతూ నౌకల నిర్మాణ రంగంలో మరింత నైపుణ్యాన్ని చాటుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ వీసీ మాలిని వి.శంకర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 31: ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు స్టీల్‌ప్లాంట్ గురజాడ కళాక్షేత్రంలో జరగనున్నాయి. ఈ మేరకు గురజాడ కళాక్షేత్రంను సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సమావేశాలకు దేశ వ్యాప్తంగా ఉన్న సుమారు మూడు వందల మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు-వాటి పరిష్కారం, ప్రభుత్వ రంగ సంస్థలపై కేంద్రం నిర్లక్ష్యం, ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించనున్నారు. సమావేశాల చివరి రోజు నగరంలోని సరస్వతి పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ఎత్తున కార్మిక ప్రదర్శనను చేపట్టనున్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, ఆగస్టు 31: స్థానిక మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి సదుపాయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశీలించి భోజనాలు ఎలా ఉన్నాయో రుచి చూశారు. విద్యార్థులకు వసతులు కల్పించడంలో ప్రభుత్వం అన్నిచర్యలు చేపడుతుందని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా తక్షణమే సమీపంలోని వైద్యశాలకు తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా వాసి గోరంట్ల వాసుబాబు విరాళంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రయోగశాలను గణబాబు ప్రారంభించారు.





పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఆగస్టు 31: పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో శనివారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో పింఛన్ల పంపిణీలో జాప్యం చోటుచేసుకోకుండా ఒకరోజు ముందే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జోరువానను సైతం లెక్కచేయకుండా ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ ఒకరోజు ముందుగా పెన్షన్లు ఇవ్వడం పట్ల వృద్ధులు వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్ రాజు, విరాంబాబు, డీవీ అప్పారావు, మాటూరి రాము, ఎస్.కనకరాజు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వడ్లపూడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో..

గోపాలపట్నం/ఎన్.ఎ.డి.జంక్షన్/మల్కాపురం: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని 89, 91, 92 వార్డులో ముమ్మరంగా చేపట్టారు. గోపాలపట్నం పరిధిలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పరిశీలించడంతో పాటు బాజీ జంక్షన్‌లో పలువురికి ఆయన పెన్షన్లు అందజేశారు. అలాగే 52వ వార్డు కరాసలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే గణబాబు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే మల్కాపురంలోనూ ఆయన పలువురికి పెన్షన్లు అందజేశారు.

వినాయక ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

మల్కాపురం, ఆగస్టు 31: గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 18 టన్నుల రాజస్థాన్ బెల్లంతో 75 అడుగులతో రూపొందిస్తున్న భారీ వినాయకుడు ముస్తాబవుతున్నాడు. ఈ ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదగా నిర్వాహకులైన లంబోదర ట్రస్టు అధ్యక్షుడు మొల్లి గోవర్ధన్ యాదవ్ ఆవిష్కరింపజేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా పర్యావరణ హితంగా బెల్లం వినాయకుడిని నెలకొల్పుతున్నట్టు లోకేశ్‌కు వివరించారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని వినతి

గాజువాక, ఆగస్టు 31: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని శనివారం పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల్లో కష్టపడిన, పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు కల్పించాలని కోరారు. అలాగే గాజువాకలోని ప్రధాన సమస్యలను ఆమెకు వివరించారు. గాజువాకలో పర్యటించవల సిందిగా ఆమెకు విజ్ఞప్తి చేశారు.



పురందేశ్వరితో మాట్లాడుతున్న కరణంరెడ్డి నరసింగరావు

డెలివరీ బాయ్‌పై తండ్రీకొడుకుల దాడి

గాజువాక, ఆగస్టు 31: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న డెలివరీ బాయ్‌పై దాడి చేసిన సంఘటన శనివారం గాజువాకలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది. పాత గాజువాక జంక్షన్ సమీపం వద్ద ముందు వెళ్తున్న కారును ఓ డెలివరీ బాయ్ తన వాహనంతో ఓవర్‌టేక్ చేసుకుని ముందుకు వచ్చి ఆగాడు. దీంతో ఆ కారులో ఉన్న తండ్రీకొడుకులు డెలివరీ బాయ్ వాహనాన్ని పడేసి, సామగ్రి ఉన్న బ్యాగును పక్కకు పడేశారు. డెలివరీ బాయ్ నేనేం తప్పు చేశాను, ఎందుకు వాహనాన్ని, సామగ్రిని కింద పడేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ సమయంలో ఓ వ్యక్తి ఆ ఘటనను వీడియో తీసి, ఇలా చేయడం సరికాదని చెప్పాడు. దీంతో కారులోని వ్యక్తి తాను సబ్ ఇన్‌స్పెక్టర్‌నని, డెలివరీ బాయ్‌కు సారీ చెప్పి వెళ్లిపోయారు. దీనిపై గాజువాక పోలీసులను సంప్రదించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

పాఠశాలల్లో ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేయాలి

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 31: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు, ఫిర్యాదు బాక్సులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ సూచించారు. డ్రగ్స్ నివారణపై ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు, హెచ్‌ఎంలకు సరస్వతి విద్యావిహార్ స్కూల్‌లో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు డ్రగ్స్ మహమ్మారి బారినపడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టనున్నామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లో కొందరిని ఎంపిక చేసి వారితో తరగతి గదిలో ఒక గ్రూపు ఏర్పాటు చేయడమే ప్రహరీ క్లబ్ అని. తద్వారా విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు గమనించి హెచ్‌ఎంలకు నివేదించాలన్నారు. గ్రీన్‌వ్యాలీ ఫౌండేషన్ ఛైర్మన్ ఉమారాజ్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో డ్రగ్స్ నియంత్రణ, విద్యార్థుల భవితవ్యం తదితర అంశాలపై తరచూ వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. సైకాలజిస్టు మంత్రి వంశీ, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సీడీపీవో రమణకుమారి, తదితరులు పాల్గొన్నారు.






బాధితునికి ఆర్థిక సాయం

మద్రిపాలెం: మద్రిపాలెం శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్న ఈసరపు వెంకీనాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నీరుకొండ దివాకర్ శనివారం బాధితునికి ఇంటికి వెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో 53, 54 వార్డుల జనసేన అధ్యక్షుడు వింజూమూరి భాస్కర్, తాటిపాకల మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.











ఏ ఆరోగ్య కేంద్రంలో చూసినా జ్వరపీడితులే ...

›› రోజుకు 100కు చేరువగా ఓపీ

అక్కయ్యపాలెం, ఆగస్టు 31: అక్కయ్యపాలెం పరిధిలో సీజనల్ జ్వరాల ప్రభావం తీవ్రంగా ఉంది. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీ విద్యుత్‌నగర్, 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు వీరి తాకిడి ఎక్కువగా కనిపిస్తోంది. ఈ రెండు ఆస్పత్రులకు రోజుకు 170 మంది జ్వర పీడితులు వస్తున్నారు. వాతావరణ మార్పులు, నీటి కలుషితంతో రోగాల బారిన పడుతున్నవారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఆస్పత్రుల్లో జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించిన మీదుట చికిత్స అందిస్తున్నారు. ఒక్కో ఆస్పత్రిలో వైద్యుడు (మెడికల్ ఆఫీసర్), ఒక ఫార్మసిస్టు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అటెండర్ సేవలందిస్తున్నారు.



కౌంటర్ వద్ద రోగులు

ఇరుకు భవనంతో అవస్థలు

గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీ విద్యుత్‌నగర్‌లోని ఆస్పత్రి ఇరుకు గదుల్లో కొనసాగుతోంది. ఇక్కడికి సరఫరా అయిన మందులను ఎక్కడ భద్రపరచాలో తెలియనిస్థితి నెలకొంటోందని సిబ్బంది చెబుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన మందుల స్టాక్ మొత్తం ఒకే గదిలో పేర్చాల్సి వస్తోంది.

వాతావరణం మార్పుతోనే జ్వరాలు



వాతావరణం మార్పు వల్ల జ్వరాలు ప్రబలుతున్నాయి. రోగ నిర్ధారణ చేశాక మెరుగైన వైద్య మందిస్తున్నాం. ఆస్పత్రికి వచ్చిన వారందరికీ మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. ఆస్పత్రిలో 43 రకాల రోగనిర్ధారణ పరీక్షలు, వివిధ రకాల వ్యాధులకు మందులుఅందుబాటులో ఉన్నాయి. ఔట్ పేషంట్లలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వా రి సంఖ్య ఎక్కువ శాతం ఉంది.

- సుధీర్, మెడికల్ ఆఫీసర్, ఆయుష్మాన్ ఆరోగ్య కేం ద్రం విద్యుత్‌నగర్

ఉత్తమ సేవలందించిన పోలీసు సిబ్బందికి రివార్డులు

మహారాణిపేట, ఆగస్టు 31: విధుల్లో ఉత్తమ పనితీరు చూపిన పోలీసు సిబ్బందికి నగర కమిషనర్ శంఖ బ్రత బాగ్చీ రివార్డులు అందించారు. శనివారం పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆగస్టులో ఉత్తమ సేవలందించిన 92 మంది పోలీసు సిబ్బందికి గుర్తించి ఈ రి వార్డులను అందించి ప్రోత్సహించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ, హోంగార్డు స్థాయి సీఐ స్థాయి అధికారుల వరకు వారు నిర్వహిస్తున్న విధుల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతినెలా ప్రోత్సహిస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణా నిరోధం, చోరీ సొత్తు రికవరీ, చిన్న పిల్లల అక్రమంగా ఇతర రాష్ట్రాలకు అమ్మకాలు చేస్తున్న ముఠా అరెస్టు, తప్పిపోయిన బాలికల ఆచూకీ గుర్తింపు తదితర కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన సిబ్బందిని పోలీసు అధికారుల సమక్షంలో అభినందనలు తెలిపారు.

పదవీ విరమణ చేసిన పోలీసు సిబ్బందికి సన్మానం

ఈసందర్భంగా పోలీసు శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఎనిమిది మంది సిబ్బంది కమిషనర్ శంఖ బ్రాత బాగ్చీ ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ చేసిన వారిలో ఏడీసీపీ కె. ప్రభాకర్, పి. నూకన్న, డి.వి. అప్పారావు, బి. అప్పారావు. బి.వి. సత్యనారయణ, కె. అశోక్ కుమార్, ఎం.వి.ఎస్.ఎన్. రాజు, టి. బాబూరావు తదితరులున్నారు.

ఫింఛన్ల పంపిణీని పూర్తి చేయాలి: కలెక్టర్

అక్కయ్యపాలెం, ఆగస్టు 31: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్‌ఎంఎన్ హరేంధిర ప్రసాద్ భాగస్వాములయ్యారు. ఒక్కరోజు ముందుగానే చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 45వ వార్డు తాటిచెట్ల పాలెంలో పలువురు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలెక్టర్ కలిసి పింఛన్ల మొత్తాన్ని అందజేశారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని డీఆర్డీఏ, యూసీడీ పీడీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కంపా హనోక్, టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు, డీఆర్డీఏ పీడీ శోభారాణి, యూసీడీ పీడీ ఫణిరాం, ఏపీడీ పద్మావతి, సచివాలయ ఉద్యో గులు పాల్గొన్నారు.


పింఛను అందిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

జోరు వానల్లోనూ పెన్షన్ల పంపిణీ

మాధవధార; రాష్ట్ర చరిత్రలో సామాజిక పెన్షన్లను ఒక రోజు ముందుగా అందించి న ఘనత ముఖ్యమం త్రి చంద్రబాబు సర్కారుకే దక్కుతుందని టీడీపీ 51వవార్డు అధ్యక్షులు సనపల.కీర్తి అన్నారు. శనివారం 51వవార్డు సీతన్న గార్డెన్స్‌లో ఆయన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు. 50వవార్డులో ఎమ్మెల్సీ దువ్వారపు.రామారావు, వార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్ తదితరులు వానలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు అందించారు.మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మద్రిపాలెం: గ్రేటర్ 53వ వార్డులో విశాఖ పా ర్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు సచి వాలయ సిబ్బందితోపాటు పలకాలనీలకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు.

మదర్ థెరిసా హోంకు నలుగురు తరలింపు

అక్కయ్యపాలెం, ఆగస్టు 31: అనాథలైన నలుగురు మహిళలను మ దర్ థెరిసా హోంలో చేర్పించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దిక్కుతోచని స్థితిలో ఉన్న సుంకమ్మ (70), లాంచన్ (40)ను, కిరణ్మయి (40)ని రైల్వే స్టేషన్ నుంచి, రాంబాయి (65)ను అడవివరం నుంచి రెస్క్యూ చేసి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని మహిళా షెల్టర్‌లో ఆశ్రయం కల్పించినట్టు చెప్పారు. నెల రోజులుగా వీరి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసినా ఫలితంలేకపోయిందన్నారు. సీఐ తిరుమలరావు ధ్రువీకరించి ఇచ్చిన లేఖ తీసుకుని హోంలో చేర్పించి ఆ శ్రయం కల్పించినట్టు పేర్కొన్నారు.

ఇండియన్ బ్యాంక్ సర్ఫాసీ అసెట్స్ ఫెయిర్

సీతంపేట, ఆగస్టు 31: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం విశాఖపట్నం ఆధ్వర్యంలో సర్ఫాసీ చట్టం పరిధిలో అసెట్స్ (ఆస్తులు) ఫెయిర్-2024 కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనను ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ అవధేష్ కుమార్ పుర్వే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ అసెట్స్ ఫెయిర్‌లో విశాఖపట్నం, రాజమహేంద్రవరం రెండు జోన్‌లకు సంబంధించిన ఎన్‌పీఏ (నిరర్థక ఖాతాలు) పరిధిలోని ఆస్తులను సంబంధించిన వాటిని ఉంచినట్లు తెలిపారు. ఆస్తుల్లో నివేశన ప్లాట్స్, స్థలాలు, గృహాలు, పారిశ్రామిక, వాణిజ్య ఆస్తులు సుమారు 100కు పైగా ఉన్నట్టు వివరించారు. ఆసక్తి ఉన్నవారు వీటి వివరాల కోసం సమీపంలోని ఇండియన్ బ్యాంక్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ ఆస్తులన్నీ ఆక్టోబరులోగా విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్టు రికవరీ చీఫ్ మేనేజర్ అజీముద్దీన్ అహ్మద్ ఇర్ఫాన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ అసెట్స్ ఫెయిర్‌లో ఇండియన్ బ్యాంక్ శాఖల సిబ్బంది, వివిధవర్గాల ప్రజలు, ఖాతాదారులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జోనల్ మేనేజర్ అవధేష్ కుమార్ పుర్వే

'శ్రావణ్' బాధితులకు ప్రముఖుల పరామర్శ

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 31: శ్రావణ్ షిప్పింగ్ గొడౌన్‌లో శుక్రవారం అసిటానిలైడ్ అనే రసాయన పౌడర్‌ను పీల్చి తీవ్ర అస్వస్థతకు గురైై షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధి తులను శనివారం పలువురు అధికారులు, నాయకులు పరామర్శించారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు,కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, ఏసీపీ త్రినాథ్‌లు బాధితులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం సేవలందించాలని వైద్యులకు వారు సూచించారు. అలాగే బాధితు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. కాగా అస్వస్థతకు గురైన గోతిరెడ్డి దేముడుబాబుతో పాటు పి.కుమారి, రాము, లక్ష్మి కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. అయితే గంగ్రెడ్డి లత ఆరోగ్య పరిస్థితి కాస్త విషమంగా ఉన్నందున శస్త్రచికిత్స చేయనున్నట్టు పేర్కొన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటువారిని 'శ్రావణ్' యాజమాన్యం ఆదుకోవాలని సీపీఐ నాయకుడు కె.సత్యనారాయణ, సీఐటీయూ నేతలు ఎం.రాంబాబు, ఎ.లోకేశ్‌లు డిమాండ్ చేశారు.


బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మిజోరాం గవర్నర్ హరిబాబుకు సత్కారం

సీతమ్మధార, ఆగస్టు 31: మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబును ఉత్తర నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు, నార్త్ కన్వీనర్ సురేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరిబాబుకు వాలువాతో విష్ణుకుమార్ రాజు సత్కరించారు.


హరిబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

అధికారుల హెచ్చరిక బేఖాతరు

›› సాగరమిత్రల కళ్లు గప్పి సముద్రంలో వేటకు మత్స్యకారులు

›› బోటు గల్లంతు..కుటుంబ సభ్యుల ఆందోళన

›› గంగవరం నుంచి సురక్షితంగా తరలింపు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వర్షాల సమయంలో వేట తగదని అధికారులు హెచ్చరిస్తున్నా మత్స్యకా రులు వినడం లేదు. జీవనోపాధి అంటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడి గత మూడు రోజులుగా సముద్రం అల్లకల్లోలంగా ఉంది. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. అయినా సరే కొందరు మత్స్యకారులు వేటకు వెళ్లిపోతున్నారు. దాంతో అధికారులు ప్రతి ల్యాండింగ్ సెంటర్‌లో పూటకు ఇద్దరు చొప్పున సాగర మిత్రలను కాపలా ఉంచి ఎవరూ వేటకు వెళ్లకుండా చూస్తున్నారు. వారి కళ్లు గప్పి కొందరు బోట్లు వేసుకొని వేటకు వెళుతున్నారు. ఇలాగే శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు పెదజాలరిపేటకు చెందిన ఐఎన్‌డి-ఏపీ-వి1-ఎం-1214 నంబరు బోటులో పొట్టి రాజు, తెడ్డు పోలరాజు, చింతపల్లి అసుదాసు అనేవారు వేటకు వెళ్లారు. మధ్యాహ్నానికి తిరిగి రావాలి. కానీ సాయంత్రం అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు చెప్పడంతో ఆయన మత్స్య శాఖ జేడీ విజయకు చెప్పారు. వెంటనే అన్ని రేవులకు సమాచారం పంపించి వివరాలు సేకరించారు. వేటకు వెళ్లిన ముగ్గురు సముద్రంలో అల్లకల్లోలంగా ఉండడంతో వెనక్కి రాలేక గంగవరం వైపు వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడానికి మొబైల్ ఫోన్లు ఛార్జింగ్ అయిపోవడంతో వీలు కాలేదు. అక్కడ కాకినాడకు చెందిన బోటు కనిపించడంతో వారి ఫోన్ తీసుకొని సమాచారమిచ్చారు. వెంటనే విషయం తెలుసుకున్న అధికారులు గంగవరం వెళ్లి బోటుతో సహా వారిని పెదజాలరిపేటకు శనివారం రాత్రి ఏడు గంటలకు తీసుకువచ్చారు.


క్షేమంగా చేరిన మత్స్యకారులతో మాట్లాడుతున్న జేడీ విజయ

వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్‌గా కె.రమేశ్

మునిసిపల్ రీజనల్ డైరెక్టర్‌గా వి.రవీంద్ర

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న వి.రవీంద్రను మునిసిపల్ రీజనల్ డైరెక్టర్ కమ్ అప్పిలేట్ కమిషనర్ (విశాఖ)గా ప్రభుత్వం బదిలీ చేసింది. విజయవాడ సీఆర్‌డీఏలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కె.రమేశ్‌ను వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్‌గా నియమించింది. గతంలో కూడా రమేశ్ వుడా అడిషనల్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు.


15 మంది సీఐల బదిలీ

›› విశాఖ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రేంజ్ పరిధిలో 15 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ డీఐజీ గోపినాథ్ జట్టి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు.

వరుస నంబర్/పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న చోటు	బదిలీ అయిన స్థానం
1. పి.పైడపునాయుడు	రేంజ్ వీఆర్	కె.కోటపాడు
2. నమ్మి గణేష్	అనకాపల్లి పీసీఆర్	అచ్యుతాపురం యూపీఎస్
3. ఎం.బుచ్చిరాజు	అచ్యుతాపురం యూపీఎస్	రేంజ్ వీఆర్
4. బి.చిన్నస్వామినాయుడు	కె.కోటపాడు	శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్
5. ఎం.వినోద్‌బాబు	రేంజ్ వీఆర్	అనకాపల్లి సోషల్ మీడియా సైబర్‌సెల్
6. ఎల్.రేవతమ్మ	సిటీ నుంచి రేంజ్ వీఆర్	నర్సీపట్నం రూరల్
7. డి.దీనబంధు	రేంజ్ వీఆర్	పాడేరు యూపీఎస్
8. డి.నవీన్‌కుమార్	పాడేరు యూపీఎస్	ఏఎస్ఆర్ జిల్లా సీసీఎస్
9. వెలగాడ శంకరనారాయణ	ఏఎస్ఆర్ జిల్లా సీసీఎస్	రేంజ్ వీఆర్
10. ఎస్.బాలసూర్యారావు	పరవాడ యూపీఎస్	అనకాపల్లి డీఎస్‌బీ-1
11. ఆర్.మల్లికార్జునరావు	రేంజ్ వీఆర్	పరవాడ యూపీఎస్
12. వి.చక్రధరరావు	సిటీ నుంచి రేంజ్ వీఆర్	విజయనగరం డీసీఆర్‌బీ
13. బెండి వెంకటరావు	రేంజ్ వీఆర్	విజయనగరం టాస్క్‌ఫోర్స్
14. జి.అప్పన్న	నక్కపల్లి	పాయకరావుపేట యూపీఎస్
15. జి.అశోక్‌కుమార్	రేంజ్ వీఆర్	అనకాపల్లి రూరల్

బీచ్‌లో కూలిన మెట్లు


కూలిన మెట్లు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిలేని వర్షాలకు శనివారం బీచ్‌రోడ్‌లో కాళీమాత గుడి ఎదురుగా బీచ్‌లోనికి వెళ్లే మెట్లు కూలిపోయాయి. రోడ్డు నుంచి సముద్రంలోనికి వెళ్లేందుకు ఒకవైపు ర్యాంపు, దానికి ఆనుకుని మెట్లు ఉ న్నాయి. మూడు రోజులుగాకురుస్తున్న వర్షాలకు మెట్లు కూలిపోయాయి.వీటికి ఆనుకుని గోడ ప్ర మాదకరంగాఉండటంతో పలువురు వాకర్లుఆందోళన వ్యక్తంచేశారు.

21 మంది సీఐల బదిలీ

›› నగరంలో పనిచేస్తున్న పది మందిని రేంజ్‌కు సరండర్ చేసిన సీపీ

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల పరంపర కొనసాగుతోంది. తొలివిడతలో 26 మంది సీఐలను బదిలీ చేసిన సీపీ శంఖబ్రతబాగ్చి శనివారం మరో 21 మంది సీఐలను బదిలీ చేశారు. నగరంలో పనిచేస్తున్న సీఐల్లో పది మందిని రేంజ్‌కు సరండర్ చేసి, వారిస్థానంలో రేంజ్ పరిధిలో పనిచేస్తున్న వారిని నగరానికి తీసుకున్నారు.

వ.నం	పేరు	ప్రస్తుతం పనిచేస్తున్నచోటు	బదిలీ అయిన స్థానం
1.	లద్దు రామకృష్ణ	పెందుర్తి	రేంజ్ వీఆర్
2.	వై.రామకృష్ణ	పీఎంపాలెం	రేంజ్ వీఆర్
3.	పి.శోభన్‌బాబు	సీసీఎస్-3	రేంజ్ వీఆర్
4.	డి.రమేష్	భీమిలి	రేంజ్ వీఆర్
5.	కర్రి వెంకట సతీష్‌కుమార్	ఏసీబీ	పెందుర్తి
6.	గేదెల బాలకృష్ణ	రేంజ్ వీఆర్	పీఎంపాలెం
7.	ఎన్.గోపాలరావు	సీసీఎస్-2	రేంజ్ వీఆర్
8.	ఆర్.మల్లికార్జునరావు	రేంజ్ వీఆర్	టాస్క్‌ఫోర్స్ జోన్-1
9.	బొడ్డేపల్లి సుధాకర్	ఏఎస్ఆర్ జిల్లా సైబర్‌సెల్	భీమిలి
10.	వెలగాడ శంకరనారాయణ	ఏఎస్ఆర్ జిల్లా సీసీఎస్	సీసీఎస్-3
11.	డీవీ రమణ	ఇంటెలిజెన్స్	ద్వారకా పీఎస్
12.	కిల్లి వెంకటరావు	జీఆర్‌పీ	సౌత్ ట్రాఫిక్
13.	ఎనుకోటి కేశవరావు	ఇంటెలిజెన్స్	స్టీల్‌ప్లాంట్
14.	వి.శ్రీనివాసరావు	స్టీల్‌ప్లాంట్	రేంజ్ వీఆర్
15.	వి.గోపీనాథ్	పీసీఆర్	రేంజ్ వీఆర్
16.	కె.రామారావు	రేంజ్ వీఆర్	సీసీఎస్-2
17.	గంగుల గోవిందరావు	ఆరిలోవ	రేంజ్ వీఆర్
18.	హెచ్.మల్లేశ్వరరావు	ఏఎస్ఆర్ జిల్లా డీసీఆర్‌బీ	ఆరిలోవ
19.	షేక్ మహ్మద్ హుస్సేన్	రేంజ్ వీఆర్	పీసీఆర్
20.	ఎస్.రమేష్	ద్వారకా పీఎస్	రేంజ్ వీఆర్
21.	వానపల్లి నాగరాజు	సౌత్‌ట్రాఫిక్	రేంజ్ వీఆర్

నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది: ఎమ్మెల్యే వంశీకృష్ణ

సిరిపురం, ఆగస్టు 31: నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో సెయింట్ జోసెఫ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ 35వ క్యాపింగ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై డాక్టర్లు సుధాకర్, సునీత, మురళీ సంతోష్, పల్లా దుర్గారావుతో కలిసి జ్యోతి ప్రజల్వనగావించారు. కాలేజీ చైర్మన్ డాక్టర్ సునీతరెడ్డి, డైరెక్టర్స్ అనిత, శ్రీకాంత్, సిరట్ల వాసు, నర్సింగ్ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి, భవాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నర్సింగ్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బ్రహ్మకుమారీస్ సేవలు భేష్

డాబాగార్డెన్స్, ఆగస్టు 31: బ్రహ్మకుమారీస్ సేవలు అద్భుతమని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. శనివారం జీవీఎంసీ కమిషనర్ ఛాంబర్‌లోని బ్రహ్మకుమారీస్ ఎంవీపీ కాలనీ బ్రాంచ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. బ్రహ్మకుమారీస్‌కు జీవీఎంసీ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే రామేశ్వరి, జీవీఎంసీ ఏడీసీ వై.శ్రీనివాసరావు, పావని, మణి, రోశన్ని, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మకుమారీస్ ప్రతినిధులతో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ప్రత్యేక కార్యాచరణతో నగరాభివృద్ధి: కమిషనర్

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు మౌలిక సదుపాయాలపరంగా మరింత అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో 1.18 లక్షల వీధి దీపాలు ఉండగా, ప్రతిరోజూ ఐదువేల లైట్లు చోరీ/ధ్వంసం జరుగుతుండడంపై పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేక నిఘా పెట్టడంతో సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. నగరంలో పది శాతం వరకు వీధి లైట్లు రోజూ వెలగడం లేదని, ఈ సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత ఏజెన్సీని పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించామన్నారు. తాగునీటి సరఫరా పైప్‌లైన్లు 390 చోట్ల గెడ్డలను క్రాసింగ్ చేస్తున్నాయని, ఇందులో 345 చోట్ల పైప్‌లైన్లను వేరేమార్గాలకు మళ్లించగా, మిగిలినవి నాలుగైదు రోజుల్లో బైపాస్ చేస్తామన్నారు. ప్రతి వ్యక్తికి 135 ఎల్‌పీసీడీ నీటిని సరఫరా చేయాల్సిఉండగా, ప్రస్తుతం 115 ఎల్‌పీసీడీ నీటిని అందిస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో వ్యాధులు విజృంభించకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రజారోగ్యానికి ఇబ్బంది లేకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామన్నారు.

ఇద్దరికీ హెల్మెట్ తప్పనిసరి

... 3వ పేజీ తరువాయి

పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తారన్నారు. బైక్ నడిపిన వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ పెట్టుకోని పక్షంలో రూ.135 ఈ-చలాన్ జారీచేయడంతోపాటు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను స్వాధీనం చేసుకుని రవాణా శాఖ అధికారులకు పంపిస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కార్డు అందుబాటులో లేకపోతే వారి డ్రైవింగ్ లైసెన్స్ నంబర్‌ను ఆర్‌టీఏ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. రవాణా శాఖ అధికారులు డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నెలలు వరకూ సస్పెండ్ చేసే అవకాశం ఉంటుందన్నారు. నగరంలో ద్విచక్ర వాహనాలను నడిపే వారంతా ఈ విషయాన్ని గమనించాలని సీపీ విజ్ఞప్తిచేశారు.

రహదారులు ఛిద్రం

... 3వ పేజీ తరువాయి

వెళ్లే రోడ్డు బాగా దెబ్బతిన్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనచోదకులు నరకం చూడాల్సి వస్తోంది. ఈ విధంగా దెబ్బతిన్న రోడ్లలో కొద్దిరోజుల కిందట నిర్మించినవి కూడా ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మద్దిలపాలెంలోని కళాభారతి రోడ్డును కొద్దినెలల కిందటే నిర్మించగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పలుచోట్ల కుంగిపోయింది. అదేవిధంగా అక్కయ్యపాలెం, వన్‌టౌన్ ప్రాంతాల్లో ఇటీవలే నిర్మించిన రోడ్లు కూడా దెబ్బతినడం చూస్తే నిర్మాణంలో నాణ్యతపై అనుమానాలు కలుగుతున్నాయి. నిర్మాణంలో నాణ్యత లోపించడం వల్లే చిన్నపాటి వర్షానికి రోడ్లు పాడైపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తనిఖీలపై తాత్సారం

... 3వ పేజీ తరువాయి

గొడౌన్‌లో కూడా ఇలాంటిదే జరిగింది. రసాయన పౌడర్ బస్తాలను దించుతూ వాటి వాసన పీల్చడం వల్ల ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. పరిశ్రమలో పనిచేసే సిబ్బందికి పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ అందజేసి, తప్పనిసరిగా వాటిని ధరించాకే విధుల్లోకి అనుమతించాల్సి ఉంది. ప్రాథమిక జాగ్రత్తలో ఇది మొదటిది. దీనిని కూడా ఎవరూ అమలు చేయడం లేదు.

ఎసెన్షియా ప్రమాదం తరువాత అన్నీ పరిశ్రమల్లో వారం రోజుల్లో ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్లు ఆదేశించారు. వారం గడిచినా ఇప్పటివరకు ఈ కార్యక్రమానికి ఇంకా శ్రీకారమే చుట్టలేదని తెలిసింది. సెప్టెంబరు మూడో తేదీ నుంచి మొదలు పెడతామని సంబంధిత పరిశ్రమల శాఖ అధికారులు తెలిపారు. వీటికి కమిటీల నియామకం, తనిఖీల విధానం వంటిని సూచించాల్సి ఉందని తెలిసింది. అత్యధిక పరిశ్రమలు కలిగిన జిల్లాలో ఇంటర్నల్ ఆడిట్ ఎలా చేయాలనే దానిపై కూడా ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన అవసరం వచ్చిందట..ఈ తనిఖీలు, నివేదికలు ఎలా జరుగుతున్నాయో కలెక్టర్లు సీరియస్‌గా ఆలోచించాల్సి ఉంది. మరో ప్రమాదం జరగక ముందే పరిశ్రమల్లో తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. మూకుమ్మడిగా పరిశ్రమల్లో పనిచేసే వారికి అవగాహన, శిక్షణ కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాల్సి ఉంది. గేటు దాటి లోపలికి వెళితే తప్పనిసరిగా మాస్క్, హెల్మెట్, బూట్లు, చేతికి గ్లోవ్స్ ఉండేలా చూడాలి.

పెందుర్తి ఎంఈవో-1 సువర్ణ సస్పెన్షన్

... 3వ పేజీ తరువాయి

అప్పటి డీఈవో షోకాజ్ జారీచేశారు. అందుకు ఏడాది ముందు మెమో జారీచేశారు. కాగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారించి గత ఏడాది సెప్టెంబరు 13న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక మేరకు పాఠశాల విద్యా శాఖ చర్యలు తీసుకునేందుకు ఏడాది సమయం పట్టింది.


మధురవాడ సర్వీసు రోడ్డులో నిలిచిన నీరు


మజ్జివలస వద్ద నీట మునిగిన పంట పొలాలు

జన జీవనానికి వాయు'గండం'

» కొనసాగుతున్న వర్షాలు » స్తంభించిన ప్రజా జీవనం » లోతట్టు ప్రాంతాలు జలమయం

మధురవాడ, ఆగస్టు 31 : మధురవాడ పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో మోకాలు లోతులో నీరు చేరింది. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో వర్షం నీరు రోడ్ల పైకి వచ్చింది. శనివారం కురిసిన కుంభవృష్టితో మధురవాడ ఎత్తు వంతెన కింద గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల మైదానం చెరువును తలపించింది. మధురవాడ పీహెచ్‌సీ వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు.

భీమిలిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భీమునిపట్నం/భీమునిపట్నం రూరల్ : తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ రామారావు తెలిపారు. హెచ్‌డీటీ సూరిశెట్టి శ్రీనుబాబు ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ పని చేస్తుందన్నారు. మండలంలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరిగినా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. వివరాలకు 9100064934, 80085 36576 ఫోన్ నంబర్లను సంప్రతించాలని సూచించారు. కాగా నియోజకవర్గంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు అనేక ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. భీమిలిలోని మజ్జివలస, మజ్జిపేట, నగరపాలెం, తాటితూరు, దాకమర్రి గ్రామాల్లోని పంట పొలాల్లో భారీగా నీరు చేరింది. సాగర్‌నగర్, పద్మనాభం, ఆనందపురం మండలాల్లో కూడా భారీ వర్షానికి పొలాలు నీట మునిగాయి.

సమాజాభివృద్ధిలో స్త్రీ పాత్ర వెలకట్టలేనిది

» హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ డిల్హారి

సిరిపురం, ఆగస్టు 31 : సమాజాభివృద్ధిలో స్త్రీ పాత్ర వెలకట్టలేనిదని హైకోర్టు జడ్జి రవినాథ్ డిల్హారి అన్నారు. సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో శనివారం వుమెన్ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'వుమెన్ అడ్వకేట్స్ ఉన్నతి' అన్న అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో వివక్షకు గురవుతున్న మహిళలకు వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. వివక్షకు గురవుతున్న మహిళా న్యాయవాదుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు జడ్జి ప్రియదర్శిని, ఏపీ హైకోర్టు జడ్జిలు భానుమతి, చీమలపాటి రవి, విశాఖ జిల్లా న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, అసోసియేషన్ అధ్యక్షురాలు అనురాధ పప్పు, కార్యదర్శి పి. హేమమాలి, బెవర సత్యనారాయణ, డి. నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి రవినాథ్ డిల్హారి

ఎన్నికల హామీలు అమలు చేస్తాం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఎండాడ, ఆగస్టు 31 : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన 8వ వార్డు పరిధిలోని ఎండాడలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1న సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛన్లు అందజేశామన్నారు. వైసీపీ ఐదేళ్లలో వ్యవస్థలను నాశనం చేయడంతో పాటు రూ. 13 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని విమర్శించారు. అనంతరం స్థానిక సమస్యలపై ఆయన వినతులు స్వీకరించారు. అలాగే ఎండాడలో రైతు బజార్ ఏర్పాటుకి అనువైన ప్రభుత్వ స్థలాలను గంటా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల సందీప్, చిక్కాల విజయ్‌బాబు, కార్పొరేటర్ అప్పారావు, చెట్టుపల్లి గోపి, శాఖరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : పట్టణంలో తెల్లవారుజామున 5 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి మంగమారిపేటలో పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జోన్ వన్ పరిధిలో 8658 మందికి గాను 8237 మందికి నగదు పంపిణీ చేశామని చెప్పారు.

రామ్‌నగర్ : జీవీఎంసీ 28వ వార్డు పితానివీధి బంగారమ్మగుడి ప్రాంతంలో కమిషనర్ సంపత్‌కుమార్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నక్కా కనకరాజు, జడ్డీ ప్రసాదరావు, ఏపీడీ పుణ్యవతి పాల్గొన్నారు.


ఎండాడలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా


జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న విజయనగరం ఎంపీ అప్పలనాయుడు దంపతులు

వుడా కాలనీలో మిస్సమ్మ షోరూమ్ ప్రారంభం

మధురవాడ, ఆగస్టు 31 : మిథిలాపురి వుడా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మిస్సమ్మ ఎంపోరియంను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దంపతులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచి మేరకు ఎప్పటికప్పుడు నూతన ఉత్సాహంతో కొత్త ఉత్పత్తులను అందించాలన్నారు. షోరూమ్ అధినేత నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంపవర్ యువర్ స్టైల్ అన్న కాన్సెప్ట్‌తో మహిళలకు అవసరమైన ఫ్యాషన్ జ్యూవెలరీ, కాస్మెటిక్స్ ఇమిటేషన్ జ్యూవెలరీ లేటెస్ట్ మోడల్స్‌లో లభిస్తాయని తెలిపారు.

'అప్పన్నస్వామి 32 రూపాలు' పుస్తకం ఆవిష్కరణ

సింహాచలం, ఆగస్టు 31 : వరాహలక్ష్మీనృసింహస్వామి ప్రహ్లాదుడిని రక్షించే సమయంలో వైరితో చేసిన యుద్ధంలో స్వీకరించిన 32 రూపాల గురించి పుస్తకం ప్రచురించినట్టు ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తెలిపారు. ఈ పుస్తకాన్ని శనివారం సాయంత్రం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు విజయనగరంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వేదపండితులు, పుస్తక రూపశిల్పి కేతినేడి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్‌గజపతిరాజు

3 నుంచి 'పొలం పిలుస్తోంది'

పద్మనాభం, ఆగస్టు 31 : మండలంలో 3వ తేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఏఓ ఎంపీఎస్ చలం చెప్పారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నెలలో ప్రతి మంగళ, బుధవారం వ్యవసాయశాఖతో పాటు అనుబంధ శాఖలు గ్రామాల్లోని పొలాలను సందర్శించి రైతులకు అవసరమైన సూచనలు ఇస్తారని చెప్పారు. 3న అనంతవరం, గొల్లలపాలెం, 4న పాండ్రంగి ఏనుగులపాలెం, 10న మద్ది, బాందేవుపురం, 11న కృష్ణాపురం, రెడ్డిపల్లి, 17న కోరాడ, బీఆర్ తాళ్లవలస, 18న పొట్నూరు, తునివలస 24న అయినాడ, చిన్నాపురం, 25న కొవ్వాడ, గంధవరం గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'చీటీ బాధితులకు న్యాయం చేయాలి'

ఆరిలోవ, ఆగస్టు 31 : ఆరిలోవకు చెందిన వెంకటలక్ష్మి సుమారు రూ. 3 కోట్లు చీటీల పేరుతో వసూలు చేసి 120 మందిని మోసం చేశారని, పోలీసులు తక్షణమే ఆమెపై చర్యలు తీసుకోవాలని ఐద్వా ఆరిలోవ జోన్ కమిటీ అధ్యక్షురాలు ఎస్. రంగమ్మ డిమాండ్ చేశారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 120 మంది ఆమె వద్ద ఆరేళ్లుగా చీటీలు కడుతున్నారని చెప్పారు. పది రోజుల క్రితం నగదు మొత్తం తీసుకుని కనిపించకుండా వెళ్లిపోయిన ఆమెపై పోలీసులు కేసు నమోదు చేయాలని కోరారు.

వినాయక ఉత్సవానికి పందిరి రాట

ఆనందపురం, ఆగస్టు 31 : మండలంలోని వేములవలస గ్రామంలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక నవరాత్రి ఉత్సవాలకు శనివారం పందిరి రాట వేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10 లో..

ప్రజా ఫిర్యాదులకు జీవీఎంసీలో హెల్ప్ డెస్క్ ప్రారంభం

వెంకోజీపాలెం, ఆగస్టు 31 : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిత్యం ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. దీన్ని కమిషనర్ సంపత్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కౌంటర్ల ద్వారా ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు చెప్పారు. అన్ని పనిదినాల్లోనూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

తొలిపావంచ ఆధునికీకరణ పనులకు శ్రీకారం


పనుల అనంతరం నమూనా చిత్రం

సింహాచలం, ఆగస్టు 31 : కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం కింద సింహాచలం దేవస్థానం పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈమేరకు మెట్ల మార్గం ప్రారంభంలో ఉన్న తొలి పావంచా ఆధునికీకరణ పనులకు శనివారం నుంచి అధికారులు శ్రీకారం చుట్టారు. రూ.13 లక్షలతో తొలిపావంచాను నూతనంగా నిర్మించనున్నారు. ఈ పనులతో ప్రస్తుతం భైరవ ద్వారంగా ఉన్న పురాతన తొలిపావంచా పూర్తిగా కనుమరుగుకానుంది.

అప్పన్నను దర్శించుకున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్



సింహాచలం, ఆగస్టు 31 : జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతీ సైనీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆమెను దేవాలయ ఇన్‌చార్జి ఏఈఓ పిళ్లా శ్రీనివాసరావు ఆహ్వానించగా, కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆమె గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజ చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలివ్వగా ఇన్‌చార్జి ఏఈఓ శాలువతో సత్కరించారు.

అప్పన్న ఆలయంలో వర్షం నీరు లీకు

సింహాచలం, ఆగస్టు 31 : అప్పన్న ఆలయంలో పలు చోట్ల వర్షం నీరు లీకుకావడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు ఆలయంలో నీలాద్రి గుమ్మం వద్ద, బేడా మండపంలో, ఆస్థాన మండపంలో, ఆలయ దక్షిణద్వారం మండపం ద్వార బంధం వద్ద వర్షం నీరు కారుతోంది. అలాగే సుమారు ఎనిమిదేళ్ల క్రితం కోట్లాది రూపాయలతో నిర్మించిన పోటు, లక్ష్మీనారాయణ ఋలవత్రాలు చేసే రెండు రాతి కట్టడాల్లోనూ పలుచోట్ల నీరు కారుతోంది. ఆలయంలో వర్షం నీరు లీకులను అరికట్టేందుకు గత ఈఓ వంగల శంకరరెడ్డితో పాటు పలువురు ఈఓలు కూడా లక్షలాది రూపాయలతో మరమ్మతులు చేయించారు. అయినా వర్షం నీరు లీక వ్వడం ఆగడం లేదు. గత ఏడాది పాలక మండలి సమావేశంలో ఇదే అంశం చర్చకు రాగా కొంత ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తూ తీర్మానం చేసినా.. ఇప్పటివరకు పనులు మాత్రం చేపట్టలేదు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

వెంకోజీపాలెం, ఆగస్టు 31 : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో 17 మంది రిటైర్డ్ ఉద్యోగులను ఉన్నతాధికారులు శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వర్మ, డి.వి. రమణమూర్తి, ప్రాజెక్టు డైరెక్టర్ పి.డి. యూసీడీ ఫణిరామ్, తదితరులు పాల్గొన్నారు.













